
పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు (ఫైల్)

అభివృద్ధే మంత్రం

తొలి ఏడాది పాలనలో దూసుకుపోయిన ఎమ్మెల్యేలు

- అభివృద్ధిలో పోటీ పడిన ఎమ్మెల్యేలు
- కొత్తదనం, మార్పు చూపించే ప్రయత్నం
- ఉండిలో రఘురామ సరికొత్త ప్రయోగం
- పాలకొల్లులో మంత్రి నిమ్మల రూటే సెపరేటు
- నూజివీడులో మంత్రి కొలుసు సరికొత్త ఒరవడి
- వివాదాలు పక్కనపెట్టి సంక్షేమం వైపు చకచకా
- ప్రజలు కోరుకున్న 'మార్పు' చూపించారు

కూటమి సర్కార్ అధికార పగ్గాలు చేపట్టి నేటికి ఏడాది. స్వల్ప కాల వ్యవధిలోనే నియోజక వర్గాల వారీగా తమను గెలిపించిన ప్రజల ఆశలు, ఆకాంక్షలు తీర్చే దిశగా పలువురు ఎమ్మెల్యేలు వేగంగా ముందుకు సాగారు. జనం మెచ్చేలా నిర్ణయాలు తీసుకున్నారు. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సరికొత్త అభివృద్ధికి నాంది పలికారు. తమ నియోజకవర్గం మిగతా వాటికంటే ముందుండాలన్న లక్ష్యంతో సరికొత్త పోటీ వాతావరణంతో ముందడుగులు వేస్తున్నారు.

- ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

ఏలూరు ధగధగ

ఈ ఏడాది కూటమి పాలనలో ఏలూరు జిల్లాలో ఎవరూ ఊహించని రీతిలో ఎమ్మెల్యేల చొరవ, రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణ కుదిరి అతి పెద్ద ప్రాజెక్టులు వచ్చాయి. విద్యా రంగంలో ఏలూరు సమీపాన అంబేడ్కర్ వర్సిటీని ఏర్పాటు చేయాలన్న నిర్ణయం అందరిలో సంతోషాన్ని మిగిల్చింది. చింతలపూడి వద్ద పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసిన రోజుల వ్యవధిలోనే పునాది రాయి పడింది. చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనతో నిరుద్యోగులకు ఉపాధి దొరకబోతుంది. ఆగిరిపల్లి మండలంలో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు కీలక నిర్ణయం తీసుకున్నారు. 1500 మందికి ఉపాధి కల్పించే ఈ ప్లాంట్ రాక వెనుక సమాచార శాఖ మంత్రి పార్థసారధి కృషి ఉంది. పోలీస్ అకాడమి కోసం మరో 55 ఎకరాలు కేటాయిస్తూ మంత్రి వర్గం నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఈ ప్రాంతంలో ప్రభుత్వ ఆధీనంలోని కొంత భూమిని ఆక్టోపస్ శిక్షణ కేంద్రానికి, పోలీస్ శిక్షణ కేంద్రానికి ఇచ్చే దిశగా ప్రయత్నాలు సాగాయి. దెందులూరు నియోజకవర్గంలో చింతమనేని ప్రభాకర్ పోలవరం కుడి కాలువ దగ్గర నుంచి సీతంపేట ఛానల్ వరకు అన్ని పనులను ఆయనే దగ్గరుండి పర్యవేక్షించారు. నియోజకవర్గమంతా సిమెంటు రోడ్ల నిర్మాణంతో ఇప్పుడు సులభంగా వాహనాలు తిరిగేలా చేశారు. కొల్లేరు సమస్యలపై సీఎంతో జరిగిన సమావేశాల్లోను పాల్గొన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో ఎర్రకాలువ నుంచి తాగునీరు జంగారెడ్డి గూడేంకు చేర్చేందుకు ఎమ్మెల్యే రోషన్ కృషి నెరవేరింది. ఏలూరు శనివారపుపేట వైపు వెళ్లే తమ్మిలేరుపై కాజ్‌వే తొలగించి బ్రిడ్జి నిర్మించేందుకు సీఎం చంద్రబాబు నిధులు మంజూరు చేశారు. నగర రూపురేఖలు మార్చేందుకు ఎమ్మెల్యే బడేటి చంటి కార్యాచరణకు దిగారు. కైకలూరు, ఉంగుటూరు నియోజకవర్గాల్లో రోడ్లతోపాటు ఇతర అభి వృద్ధి పనులతో పాటు కొల్లేరుకు ఒక కళ రప్పించేలా ఎమ్మె ల్యేలు డాక్టర్ కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు కృషి దాగి ఉంది.

పశ్చిమలో మరో ప్రస్థానం

పాలకొల్లు నియోజకవర్గంలో జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తనదైన శైలిలో అభివృద్ధికి ప్రయత్నిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో రోడ్లతోపాటు పెండింగ్ పనుల పూర్తికి సానుకూలత వ్యక్తమైంది. యలమంచిలి మండలంలో గోదావరి ఏటి గట్ల పటిష్ఠతకు నిధులు విడుదలై పనులు సాగడానికి మార్గం ఏర్పడింది. పాలకొల్లు పట్టణాన్ని తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించుకున్నారు. డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘు రామకృష్ణరాజు ఈ ఏడాది కాలంలో తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ఉండిలో కాలువ గట్లపై ఆక్రమణలు తొలగించడమే కాకుండా అన్ని కాలువలు, మురుగు కాలువల ప్రక్షాళనకు సాహసించారు. పోలీస్‌స్టేషన్ల భవనాల నిర్మాణం, వాహనాలు సమకూర్చడమే కాకుండా నియోజక వర్గంలో ప్రశాంత వాతావరణం నెల కొనేలా సీసీ కెమె రాలు ఏర్పాటు చేశారు. నరసాపురం నియోజక వర్గంలోను ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ఏడు కోట్లతో కొత్త రోడ్లు వేశారు. తాగునీటి పంపిణీ సక్రమంగా సాగేలా ఫిల్టర్ బెడ్‌లకు నాంది పలికారు. ఆక్వా యూనివర్సిటీ, హార్బర్, వశిష్ఠ వారధి ఎమ్మెల్యే ఆశించినట్టుగా ముందుకు సాగలేదు. తణుకు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పట్టణంలో మూలనపడిన పార్కుకు జీవం పోశారు.సీఎంను ఒప్పించి రూ.50 కోట్లు నిధులు రాబట్టారు. రోడ్లను అద్దంలా తీర్చిదిద్దేందుకు రూ.20 కోట్లు రాబట్టడమే కాకుండా ఆ మేరకు పనులు చేయించారు. తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తన నియోజకవర్గంలో అభివృద్ధికి కోట్ల రూపాయలు వచ్చేలా చూశారు. ఒక్క రైల్వే పనులకే రూ.300 కోట్లు, మినీ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణం పూర్తి చేసేందుకు స్వయంగా కృషి చేయడం అందరి మన్ననలకు దారితీసింది. ఆచంట నియోజకవర్గంలో ప్రజా సమస్యలను ముందుగా తెలుసుకోవడం, దానికి తగ్గట్టుగానే తదుపరి నిర్ణయాలు తీసుకోవడంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సక్సెస్ అయ్యారు. గ్రామాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకోవడానికే ఎక్కువ సమయం కేటాయించారు. భీమవరం నియోజకవర్గంలో డంపింగ్ యార్డు, బైపాస్ వంటి కీలక సమస్యలను పరిష్కరించడానికి ఎమ్మెల్యే అంజిబాబు సర్వశక్తులు ఒడ్డారు.

- ఎమ్మెల్యేల మనోగతం.. (లోపలి పేజీలో)

గళం వినిపించడంలో ఘటికులు



- నరసాపురం లోక్‌సభ స్థానంలో ఉన్న సమస్యలే కాకుండా ఉక్కు సహాయ మంత్రి హోదాలో భూపతిరాజు శ్రీనివాసవర్మ మెరుగైన పాత్ర పోషించారు. తొలిసారిగా పార్లమెంట్‌లో అడుగుపెట్టినా తడబాటు లేకుండా నిలిచారు. ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామితో కలిసి విశాఖ ఉక్కు కర్మాగారం వివాద పరిష్కారంలో కీలకంగా వ్యవహరించడమే కాకుండా రాష్ట్రస్థాయిలో తగినంత అనుకూలత సాధించగలిగారు. నర్సాపురం లోక్‌సభ స్థానం పరిధిలో ఆక్వా సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకున్నారు. నర్సాపురం రైల్వే స్టేషన్ ఆధునికీకరణలో, వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నిలుపుదలలో చురుగ్గా వ్యవహరించారు. ప్రత్తిపాడు-నవాబ్‌పాలెం-ఆరుళ్ల మార్గంలో రైల్వే వంతెన నిర్మాణానికి రూ.200 కోట్లు కేటాయించేలా చేశారు. ఆకివీడు-దిగమర్రు నాలుగులైన్ల రహదారి అభివృద్ధికి కీలక భూమిక పోషించారు. లోసరి-పిప్పర జాతీయ రహదారి అనుసంధానానికి వంద కోట్లు మంజూరు చేయించారు. కిడ్నీ బాధితులను ఆదుకునేలా తన పార్లమెంట్‌స్థానం పరిధిలో ఏడు డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేయబోతున్నారు.
- ఏలూరు లోక్‌సభస్థానం పరిధిలో అనేక సమస్యలపై పార్లమెంట్‌లో ఈ ఏడాది గళం వినిపించింది. రైతులు, రైల్వే, కొల్లేరు వంటి కీలక సమస్యల ప్రస్తావనలో ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్ చొరవ చూపించారు.



ఏడాదిలో ఆయన కేంద్రంలో అనేకమంది మంత్రులతో భేటీ అయ్యారు. భద్రాచలం-కొవ్వూరు రైల్వేలైన్‌కు క్లియరెన్స్ లభించేలా చేయగలిగారు. నియోజక వర్గ పరిధిలో రైల్వే స్టేషన్లలో వసతుల కల్పనకు కృషి చేశారు. పామాయిల్, కోకో రైతుల సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించారు. కొల్లేరు సమస్య అత్యంత సున్నితమైందీ కాగా, సరస్సు పరివాహకంలో సాధారణ ప్రజలు జీవించేలా వారికి అవకాశాలు మెరుగుపర్చాలని పార్లమెంట్ దృష్టికి తీసుకువచ్చారు. కొల్లేరు, రైతు ప్రతినిధులతో కేంద్ర మంత్రులను కలిసి చర్చించారు. ఈ ఒక్క ఏడాదిలో ఎంపీగా పుట్టాకు మంచి మార్కులే లభించాయి.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ పుట్టా మహేశ్ కుమార్

సమన్వయంతో సమస్యల పరిష్కారం

- ముదినేపల్లి ప్రజావేదికలో ఏలూరు ఎంపీ మహేశ్‌కుమార్

ముదినేపల్లి, జూన్ 11(ఆంధ్రజ్యోతి):ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు సమన్వ యంతో వ్యవహరిస్తూ సానుకూలంగా స్పందిస్తేనే గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ అన్నారు. ముదినేపల్లి 'వి' కన్వెన్షన్ హాలులో బుధవారం నిర్వహించిన కైకలూరు నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎంపీ మాట్లాడుతూ.. 'సమస్యలను పూర్తిగా అధ్యయనం చేసి చర్యలు తీసుకుంటే శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ప్రజా సమస్యలను తీర్చడం నాయకులు, అధికారులు తమ బాధ్యతగా భావించాలి. కొల్లేరు ప్రజల జీవనోపాధి మెరుగుపర్చడం, డిఫామ్, జిరాయితీ భూముల పంపిణీపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారు. రాబోయే రోజుల్లో అన్ని మండలాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలను నిర్వహిస్తాం' అని తెలిపారు. ప్రజల నుంచి 125 వినతులు రాగా వాటిని పరిశీలించి అయా శాఖల అధికారులతో సమీక్షించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మెంటే పార్థసారథి, చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, కొత్తా నాగేంద్ర కుమార్, పెన్మెత్స త్రినాథరాజు, కోటప్రోలు కృష్ణారావు, అధికారులు పాల్గొన్నారు.


పాల్గొన్న అధికారులు, ప్రజలు

సంక్షిప్తంగా..

స్పౌజ్ పెన్షన్‌ల పంపిణీ వాయిదా

ఏలూరు సిటీ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): సుపరిపాలన - స్వర్ణాంధ్రలో పాల్గొనేందుకు ఎమ్మెల్యేలంతా విజయవాడ వెళుతున్న కారణంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకంలో గురువారం అందించాల్సిన సప్లిమెంటరీ స్పౌజ్ పెన్షన్ల పంపిణీ వాయిదా పడింది. ఈ విషయాన్ని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.విజయరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎప్పుడు పంపిణీ చేసేది త్వరలో వెల్లడించనున్నారు.

13న సీఆర్ఆర్‌లో యోగాంధ్ర

ఏలూరు అర్బన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): యోగాంధ్రలో భాగంగా ఈ నెల 13న ఉదయం 6.30 గంటల నుంచి ఏలూరు సీఆర్‌రెడ్డి కళాశాల ప్రాంగణంలో ఎనిమిది వేల మంది విద్యార్థులతో జిల్లాస్థాయిలో యోగాంధ్ర నిర్వహించనున్నారు. ఏర్పాట్లపై బుధవారం విద్య, ఆయుష్, మున్సిపల్, రెవెన్యూ, తదితర శాఖల అధికారులతో కలెక్టర్ వెట్రిసెల్వి టెలీకాన్ఫరెన్సులో సమీక్షించారు. జేసీ ధాత్రిరెడ్డి, జడ్పీ సీఈవో భీమేశ్వరరావు, ఆర్డీవో అంబరీష్, డీఈవో వెంకటలక్ష్మమ్మ, కార్పొరేషన్ కమిషనర్ భానుప్రతాప్ పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 180 మంది అర్హులు

ఏలూరు అర్బన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి):ఐటీఐ ఉత్తీర్ణులు, ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులకు సత్రంపాడు ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో బుధవారం క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. వివిధ కంపెనీల్లో ఉద్యోగ నియామకాలకు మొత్తం 180 మంది అభ్యర్థులు అర్హత సాధించగా, వీరిలో 87 మందికి నియామకపత్రాలు అందజేశారని ప్రిన్సిపాల్ భూషణం తెలిపారు. సెట్‌వెల్ సీఈవో ప్రభాకర్, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఈవో బాబూరావు బదిలీ

ద్వారకాతిరుమల, జూన్ 11(ఆంధ్రజ్యోతి):శ్రీవారి దేవస్థానం డిప్యూటీ ఈవో పి.బాబూరావు అన్నవరం వీరవెంకట సత్యనారాయణస్వామి దేవస్థానానికి బదిలీ అయ్యారు. అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవస్థానం డిప్యూటీ ఈవో వై.భద్రాజీని ద్వారకాతిరుమల ఆలయ డిప్యూటీ ఈవోగా బదిలీ చేశారు.

డీఎస్సీ పరీక్షలకు 14 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి):మెగా డీఎస్సీ పరీక్షల్లో మంగళవారం సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో ఉదయం పరీక్షకు 180 మంది అభ్యర్థులకు 177 మంది, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో 200 మందికి 197, మధ్యాహ్నం షిఫ్టునకు 200 మందికి 192 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం మీద 14 మంది గైర్హాజరయ్యారు.

బడికి నవోదయం

- వేసవి సెలవులకు బైబై.. నేటి నుంచి తెరుచుకోనున్న స్కూళ్లు
- విద్యా సంవత్సరం ప్రారంభం.. కొత్త విధానాలతో బోధన
- పునర్వ్యవస్థీకరణతో ప్రభుత్వ పాఠశాలలకు నూతన సొబగులు
- ఈ ఏడాది మధ్యాహ్న భోజనంలో సన్నబియ్యం ఏర్పాటు
- పుస్తకాలు, యూనిఫామ్, బ్యాగ్, భోజనం అన్నీ ఉచితమే!

ఏలూరు అర్బన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, టీచర్ల కేటాయింపు, బడులకు నూతన సొబగులు, సమగ్రమైన అకడమిక్ కేలండర్, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపయోగపడేలా సిలబస్, తదితర ప్రాధామ్యాలతో వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి కొత్త విద్యా సంవత్సరం (2025-26) ప్రారంభమవుతోంది. ప్రభుత్వ బడుల్లో నిలిచిపోయిన పనులకు మన బడి - మన భవిష్యత్తు పథకంతో మోక్షం లభించనుంది.

ఒక్క ప్రభుత్వ పాఠశాలను మూసేయకుండా తొమ్మిది రకాల బడులుగా పునర్వ్యవస్థీకరించడం ఈ ఏడాది పాఠశాల విద్యలో కీలకమార్పు. అంగన్‌వాడీ కేంద్రాలు 2,225, బేసిక్ ప్రైమరీ స్కూల్స్ 932, ఫౌండేషన్ స్కూల్స్ 107, మోడల్ ప్రైమరీ స్కూల్స్ 297, ప్రాథమికోన్నత పాఠశాలలు 75, హైస్కూళ్లు 239 (వీటిలోనే మరో రెండు రకాల స్కూళ్లు), హైస్కూల్ ప్లస్‌లు 26గా కొత్తగా ఏర్పాటవుతున్నాయి. వీటిలో ఈ ఏడాది 1.60 లక్షల మంది విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ ఉంటుందని అంచనా. హైస్కూళ్ల నుంచి 3, 4, 5 తరగతులను విడదీసి సమీప ప్రాథమిక పాఠశాలలకు తరలించడం ద్వారా ఒకటి నుంచి ఐదో తరగతి వరకు బోధనతో కొత్తగా మోడల్ ప్రైమరీ స్కూళ్ల ఏర్పాటుతోపాటు, ప్రతీ తరగతికి ఒక టీచరును ఇవ్వడం వల్ల పటిష్ఠ బోధనకు అవకాశం కల్పించినట్టయింది. కనిష్ఠంగా 60 మంది విద్యార్థులున్నా 4+1 నిష్పత్తిన ఎస్జీటీలు, ఒక హెచ్‌ఎం వంతున ప్యాట్రన్‌ను నిర్ణయించడంతో కేవలం 15 మంది విద్యార్థులకో ఉపాధ్యాయుడు చొప్పున బోధనకు ప్రత్యేకించినట్టయింది. గతంలో ఎన్నడూ ఈ విధానం లేదు. ఉపాధ్యాయుడు, విద్యార్థుల నిష్పత్తిని ప్రామాణికంగా తీసుకుని మిగులు (సర్‌ప్లస్) టీచర్లను ఎవరైనా సెలవు పెడితే వారు తిరిగి విధుల్లో చేరే వరకు ప్రత్యామ్నాయ టీచర్లుగా వ్యవహరిస్తారు.



సెకండరీ విద్యలో పెనుమార్పులు

హైస్కూలు విద్యలో ఉపాధ్యాయులు రోజువారీ లెసన్ ప్లాన్‌ను రాష్ట్రవ్యాప్తంగా ఏకీకృతం చేస్తున్నారు. నిర్దేశిత రోజు టీచరు బోధించాల్సిన పాఠ్యాంశం రాష్ట్రమంతటా అన్ని పాఠశాలల్లో ఒకే రీతిన ఉంటాయి. ఆ మేరకు టీచర్లందరికీ హ్యాండ్‌బుక్‌ను క్యూఆర్ కోడ్‌తో రూపొందించి టీచర్ డైరీగా అందుబాటులోకి తెచ్చారు. గతంలో వీటిని ఉపాధ్యాయులు పాఠశాలల వారీగా తయారు చేసుకునేవారు. ఉన్నత తరగతులు చదివే విద్యార్థుల కోసం అసెస్‌మెంట్ బుక్‌ను రూపొందించి సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. విద్యార్థులు అన్ని ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్షలకు జవాబులను ఈ అసెస్‌మెంట్ బుక్‌లోనే రాయాల్సి ఉంటుంది. ఈ ఏడాది నుంచి 94,520 మంది బాల బాలికలకు మధ్యాహ్న భోజన పథకంలో సన్న బియ్యం వినియోగించనున్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థిమిత్ర పేరిట విద్యార్థులకు ఒక్కొక్క కిట్ రూ.2279ల వ్యయంతో ప్రభుత్వం సమకూరుస్తోంది. యూనిఫాంకు సరిపడా వస్త్రం, బెల్టు, నోట్, టెక్స్ట్ పుస్తకాలు, వర్క్ బుక్‌లు, బ్యాగు, బూట్లు, సాక్సులు, డిక్షనరీ ఈ కిట్లలో ఉంటాయి. ఈ నెలాఖరులోగా నిర్వహించనున్న మెగా పేరెంట్, టీచరు మీట్ నాటికల్లా విద్యార్థులందరికీ సరఫరా చేయనున్నారు. ఈ ఏడాది నుంచి సెమిస్టర్ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. ఒకటో, రెండో తరగతి **(మిగతా 6వ పేజీలో)**

రండి.. అంగన్‌వాడీ పిలుస్తోంది

- నేటి నుంచి మూడేళ్లు దాటిన పిల్లలకు ప్రవేశాలు.. ఏర్పాట్లు పూర్తి

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రవేశాల కల్పనకు..ఐదేళ్లు పూర్తి చేసుకున్న పిల్లలను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించే లక్ష్యంతో 'రండి.. అంగన్‌వాడీ పిలుస్తోంది' కార్యక్రమానికి తెలుగుదేశం ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. బడులతో పాటు సమాంతరంగా అంగన్‌వాడీల్లో పిల్లలను కొత్తగా చేర్చుకుని వారికి సామూహిక అక్షరాభ్యాసాలకు ఐసీడీఎస్ అధికారులు ఏర్పాట్లు చేశారు. గురువారం నుంచే ఈ ప్రక్రియ ప్రారంభించనున్నారు. జిల్లాలో 2,215 అంగన్‌వాడీ కేంద్రాలుండగా అందులో వివిధ వయస్సుల పిల్లలు లక్ష వరకు ఉంటారు. ఇందులో ప్రీ స్కూల్‌కు 10వేల లోపు మంది వెళ్లే అవకాశం ఉంది. కొత్త వారు ఎంతమంది చేరతారనే అంశాలపై సెంటర్ల వారీగా సీడీపీవోలు ఆరా తీస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెలాఖరు వరకు ప్రత్యేక కార్యాచరణతో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ముందుకు సాగుతారు. అన్ని కేంద్రాల పరిధిలో విస్తృత అవగాహన కార్యక్రమాలను ప్రచారం చేయనున్నారు. ఐసీడీఎస్, ఆరోగ్య, గ్రామవార్డు సచివాలయాల ఎంఎస్‌కే వంటి శాఖల సమన్వయంతో ప్రచారానికి అడుగులు వేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరడం వల్ల ఏమేమి ప్రయోజనాలు, విద్యాబోధన వంటి వాటిని విశదీకరిస్తారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అంగన్ వాడీల్లో ఐదేళ్ల వయస్సు దాటిన వారికి గ్రాడ్యుయేషన్ డేలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్దేశించింది.



- ఏరువాక సాగారో..



వరుణదేవుడు కరుణించి ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి అన్నదాతలకు సిరులు పండాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆకాంక్షించారు. పెదవేగి మండలం వంగూరులో మంత్రి అచ్చెన్న, చాట్రాయి మండలం జనార్దనవరంలో మంత్రి కొలుసు ఏరువాక పౌర్ణమి పూజలు చేసి విత్తనాలు చల్లి అరక దున్నారు.




సాఫీగా ఎస్జీటీల మాన్యువల్ కౌన్సెలింగ్
నేడు 900 మందికి బదిలీ కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు

గోదావరి తీరంలో పట్టుబడిన గంజాయి

రిమాండ్ ఖైదీ మృతి

లోపలి పేజీలో..

దేవాలయాల్లో కనీస సౌకర్యాలకు ప్రాధాన్యం : అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్



ఏలూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని దేవాలయాల్లో భక్తులకు కనీస సౌకర్యాల కల్పనకు ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తానని నూతన జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కూచిపూడి శ్రీనివాస్ అన్నారు. కైకలూరులోని కొల్లేరు పెద్దింటమ్మ గుడి ఈవోగా పని చేస్తున్న ఆయన పూర్తి అదనపు బాధ్యతలతో అసిస్టెంట్ కమిషనర్‌గా ఇటీవల నియమితులయ్యారు. ఏలూరు కార్యాలయంలో బుధవారం ఉద్యోగ బాధ్యతలను స్వీకరించిన ఆయన మాట్లాడుతూ దేవాలయ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలను కలిసికట్టుగా చేపడతానని తెలిపారు. ఇక్కడ పనిచేసిన అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రంగారావు విజయవాడ కనకదుర్గ గుడి అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు.

కూల్ కూల్

- మారిన వాతావరణం.. కురిసిన వర్షం

ఏలూరుసిటీ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఈదురుగాలులు, పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. పలుచోట్ల విద్యుత్‌కు అంతరాయాలు ఏర్పడ్డాయి. గడచిన 24 గంటల్లో అత్యధికంగా ముదినేపల్లి మండలంలో 193.6 మిల్లీమీటర్లు (19.3 సెంటీమీటర్లు) వర్ష పాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 40.8 మి.మీగా నమోదైంది. మండవల్లి 96.4, ముసునూరు 81.6, కైకలూరు 75.2, పెదవేగి 72.6, పెదపాడు 70.6, ఏలూరు రూరల్ 64.2, టి.నరసాపురం 57.2, నూజివీడు 47.6, భీమడోలు 45.8, కామవరపుకోట 45.2, దెందులూరు 43.2, కలిదిండి 38.2, చింతలపూడి 37.2,ఏలూరు అర్బన్ 36.4, ఆగిరిపల్లి 32.6, ద్వారకాతిరుమల 30, జీలుగుమిల్లి 26.4, చాట్రాయి 24.8, లింగపాలెం13, ఉంగుటూరు 10.2 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి.



అభివృద్ధికి అంకితం

కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టి ఏడాది పూర్తయింది.. వైసీపీ ఐదేళ్ల పాలనలో విసుగెత్తిన ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.. తమను గెలిపించిన ప్రజల ఆశలు, ఆకాంక్షలు తీర్చే దిశగా జనం మెచ్చే విధంగా ఎమ్మెల్యేలు అడుగులు వేస్తున్నారు. తమ నియోజక వర్గాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళుతున్నారు.. ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలోని ఎమ్మెల్యేలు నియోజకవర్గ అభివృద్ధిపై తమ అభిప్రాయాలను తెలియజేశారు..

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

రఘురామకృష్ణరాజు, డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే



ఉండి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నా. నియోజకవర్గంలోని పంట కాలువలు, మురుగు బోదెలను బాగు చేయించాను. ప్రజలకు సురక్షితమైన తాగునీరందించేందుకు రూ.5 కోట్లతో నియోజకవర్గంలో 25 మైక్రో ఫిల్టర్ బెడ్స్‌ను ఏర్పాటు చేయించా. ఆకివీడులో డయాలసిస్ సెంటర్, రూ.4 కోట్లతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించాను.ఆకివీడులో అధ్వానంగా ఉన్న డంపింగ్ యార్డును పార్క్‌గా తీర్చిదిద్దాం. పంట కాలువలు కలుషితం అవ్వకుండా కాలువలను చేర్చి ఉన్న ఆక్రమణలను తొలగించడం, ట్రాఫిక్‌కు ఇబ్బందికరంగా ఉన్న రహదారులను వెడల్పు చేయించాం. సమస్య అనేదే లేకుండా నియోజకవర్గాన్ని తీర్చిదిద్దాలన్నదే నా ఆకాంక్ష.

పేదలకు టిడ్కో ఇళ్లు అందించడమే లక్ష్యం

పులపర్తి రామాంజనేయులు, భీమవరం ఎమ్మెల్యే



గ్రామాల్లో ఎన్‌ఆర్‌జీఎస్ ద్వారా రోడ్ల అభివృద్ధి చేశాం. కూటమి ప్రభుత్వ హయాంలో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తా. ఈ ఏడాది లో నియోజక వర్గంలో దాదాపు 24 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టా. ఇందులో ఎన్‌ఆర్‌జిఎస్ పథకంలో 9 కోట్లు, డ్రైయిన్ల అభివృద్ధికి 3 కోట్లు, రోడ్ల అభివృద్ధికి రూ. 2 కోట్లతో పనులు చేపట్టాం. ఎన్‌ఆర్‌జీఎస్ నిధుల ద్వారా మరిన్ని అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాం. పట్టణానికి సంబంధించి భీమవరంలో మూడు వంతెనలకు అప్రోచ్‌లు ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకువచ్చాం. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న డంపింగ్ యార్డు సమస్య పరిష్కరించాం. అర్హులైన పేదవారికి టిడ్కో ఇళ్లు అందించడం లక్ష్యంగా పెట్టుకున్నాం.

నియోజకవర్గమే నా కుటుంబం

నిమ్మల రామానాయుడు, పాలకొల్లు ఎమ్మెల్యే



పాలకొల్లు నియోజక వర్గమే నాకుటుంబం.వారి ఆశీసులతో మూడు మార్లు ఎమ్మెల్యే కాగలిగాను. మంత్రిగా ఉన్నప్పటికీ ప్రజా సేవకునిగా రోజులో 18 గంటలరు విశ్రాంతి లేకుండా పనిచేస్తున్నా.. పాలకొల్లును ఆదర్శ నియోజక వర్గంగా తీర్చిదిద్దడానికి ప్రాధాన్యం ఇస్తున్నా. పట్టణంలోని నిరుపేదల సొంత ఇంటి కల నెరవేర్చేందుకు టిడ్కో గృహాల నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి పనులు 80 శాతం పూర్తి చేశాం. నియోజక వర్గం మొత్తంగా 100 కోట్లకు పైగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.ఎన్నికల్లో ఇచ్చినహామీలు అన్నింటిని నెరవేరుస్తూ అన్నివర్గాల ప్రజలకు సంక్షేమాన్ని, అభివృద్ధిని అందించేందుకు కృషి చేస్తున్నాం. కూటమి ప్రభుత్వ పాలనపట్ల అన్ని వర్గాల ప్రజలు సంతృప్తితో ఉన్నారు.

అన్ని రంగాల్లో నియోజకవర్గ అభివృద్ధి

చింతమనేని ప్రభాకర్, దెందులూరు ఎమ్మెల్యే



అభివృద్ధికి ఆమడ దూరంగా ఉన్న దెందులూరు నియో జకవర్గాన్ని ఏడాది కాలంలో అన్ని రంగాల్లోనూ అభివృద్ధి బాట పట్టించాం. అధ్వాన్నంగా ఉన్న రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ఏడాది కాలంలోనే దాదాపు రూ.75 కోట్లు వెచ్చించి, రహదారులను అభివృద్ధి చేశాం. ఏలూరు నుంచి పెదపాడు మీదుగా పెరికీడు వెళ్లే 20 కిలోమీటర్ల రహదారిని రూ.30 కోట్లతో అభివృద్ధి చేశాం. రూ.14.84కోట్లతో నీటి సరఫరా విభాగం పనులు నిర్వహణ చేపట్టాం. రూ.16.25 లక్షలతో కొవ్వలిలో రూ.14 లక్షలతో కూచింపూడిలోని బాలుర వసతి గృహాలకు మరమ్మతులు నిర్వహించాం. నియోజకవర్గం వ్యాప్తంగా 200 గోకులం షెడ్ల నిర్మాణాలకు రూ.4.40 కోట్లు నిధులు అందించాం.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

బడేటి రాధాకృష్ణయ్య(చంటి), ఏలూరు ఎమ్మెల్యే



ప్రతీరోజు, అనునిత్యం ప్రజల వద్దకు వెళ్ళి సమస్యలు తెలుసుకుని దాదాపు 80 శాతం సమస్యలు పరిష్కరించాం. 365 రోజులు కార్యాలయంలో అందుబాటులో ఉంటూ నిత్యం ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. ఈ ఏడాది సుమారు రూ.9 కోట్లతో సీసీ రోడ్లు నిర్మించాం. మరో నాలుగున్నర కోట్ల ఆర్‌అండ్‌బీ నిధులతో నూజివీడు, ఏలూరు రోడ్డును నిర్మిస్తున్నాం. కూటమి ప్రభుత్వం వచ్చి రావడంతోనే పేదల కడుపు నింపేందుకు నగరంలో ఐదు అన్నా క్యాంటీన్లు ప్రారంభించాం. రూ.3 కోట్లతో ఐదు చెరువులను ఆధునీకరిస్తున్నాం. ఇప్పటికే పేదలకు 1500 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశాం. మరో 3500 ఇళ్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయి.రూ.15 కోట్లతో శనివారపుపేట కాజ్వే నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం.

నియోజకవర్గ అభివృద్ధే నా ధ్యేయం

ఆరిమిల్లి రాధాకృష్ణ, తణుకు ఎమ్మెల్యే



విధ్వంసం నుంచి అభివృద్ధి దశగా అడుగులు వేశాం. సంవత్సర కాలంలో నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టాం. ప్రధానంగా గోతుల రహదారులతో ఇబ్బందులు పడేవారు. ప్రతి గ్రామానికి పక్కా రోడ్డులు నిర్మించాం. నియోజకవర్గంలో 358.84 కోట్లుతో వివిధ శాఖల పరిధిలో పనులు చేపట్టాం. మార్చి15న ముఖ్యమంత్రి చంద్రబాబు తణుకు విచ్చేసినపుడు మునిసిపాలిటికి రూ.50 కోట్లు పనులకు ఆమోదం తెలిపారు. ప్రస్తుతం ఆయా పనులకు ప్రాజెక్టు రిపోర్టులు రూపకల్పనలో ఉన్నాయి. ఇరగవరం, అత్తిలి, తణుకు మండలాలకు సంబంధించి మరో రూ.50 కోట్లు పనులకు ఆమోదం తెలిపారు. నీతివంతమైన పాలనతో పాటు ప్రజా అవసరాలు తీర్చడానికి అధిక ప్రాధాన్యం ఇస్తాను.

ఏడాదిలో ఎంతో అభివృద్ధి


బొలిశెట్టి శ్రీనివాస్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే



వైసీపీ పాలనలో నియోజకవర్గం అభివృద్ధిలో వెనకబడింది. కూటమి అధికారం చేపట్టిన ఏడాదిలోనే ఎన్నో అభివృద్ధి పనులు చేశాం. రూ.19 కోట్లతో 150 కిలోమీటర్ల మేర గోతులు పూడ్చాం. మాధవరం-అప్పారావుపేట, అప్పారావుపేట-జగన్నాధపురం, అప్పారావుపేట-వీరంపాలెం రహదారులు, పడమరవిప్పర్రు రహదారిని పూర్తి చేశాం. నగంలో ఆగిపోయిన ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ పీ4 విధానంలో ప్రజల సహకారంతో ముందుకు తీసుకు వెళుతున్నాం. పట్టణంలో జెడ్పీ స్కూల్ ప్రాంగణంలో దాతల సహకారంతో ఆటగాళ్ల కోసం గ్రౌండ్‌లు, వాకింగ్ ట్రాక్, స్టేజ్ నిర్మాణాన్ని చేపట్టాం. భవిష్యత్‌లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తాం. కూటమి పాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ నిధులతో నిర్వాసితులకు మేలు

చిర్రి బాలరాజు, పోలవరం ఎమ్మెల్యే



పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు రూ.80 కోట్లు పెండింగ్ బకాయిలు ఇప్పించటంలో సంతృప్తి చెందా. వైసీపీ ప్రభుత్వంలో నిధులు విడుదల కాక నిర్వాసితులు ఇబ్బందులు పడ్డారు.కూటమి ప్రభుత్వం వచ్చాక నిధులు విడుదల చేయడంతో గిరిజనులకు ఎంతో మేలు జరిగింది. నియోజకవర్గంలో ఏడు మండలాల్లో రూ.20 కోట్ల నిధులతో ఆర్‌అండ్‌బీ , పీఆర్ , బీటీ రోడ్లను నిర్మించాం.రూ.35కోట్ల ఉపాధి నిధులతో సీసీ, గ్రావెల్ రోడ్ల నిర్మాణం చేశాం. నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి జలజీవన్ మిషన్ ద్వారా 20 మంచినీటి ట్యాంకులు నిర్మాణం జరుగుతోంది. కొయ్యలగూడెంలో ఎప్పటి నుంచో దీర్ఘకాలిక సమస్యగా మిగిలిని డిగ్రీ, కళాశాల, ఫైర్‌స్టేషన్ మంజూరు చేయించాం.

కోకో సంబంధిత పరిశ్రమల ఏర్పాటుకు కృషి

సొంగా రోషన్‌కుమార్, చింతలపూడి ఎమ్మెల్యే



గ్రామాల్లో ప్రతీ శుక్రవారం గ్రామ సభలు నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నా. ఇప్పటికే నాలుగు గ్రామసభలు నిర్వహించాం. ఇది పెద్ద నియోజకవర్గం. ఇంకా చేయాల్సిన పనులు ఉన్నాయి. ఫేజ్-1, ఫేజ్-2 ద్వారా పంచాయతీరాజ్ శాఖలో రోడ్లు, సీసీ రోడ్లు, గోతులకు మరమ్మతులు పూర్తి చేశాం. నియోజకవర్గంలో చింతలపూడి, జంగారెడ్డిగూడెం మునిసిపాలిటీలలో తాగునీరు, చెరువుల అభివృద్ధి, బ్యూటిఫికేషన్, సెంట్రల్ లైటింగ్ పనులపై దృష్టి పెట్టాం. ఈ ప్రాంతంలో కోకో పంట అధికంగా ఉంది. ఇందుకు సంబంధించిన పరిశ్రమలు పెట్టాలని పారిశ్రామికవేత్తలతో చర్చలు జరిపాం. వంద పడకల ఆసుపత్రి భవనాలు సెప్టెంబర్ నాటికి పూర్తి చేసి ప్రారంభిస్తాం.

ఎన్నికల హామీలపై దృష్టి

బొమ్మిడి నాయకర్, నరసాపురం ఎమ్మెల్యే



ఏడాది పాలన సంతృప్తినిచ్చింది. వైసీపీ హయాంలో అధ్వాన్నంగా మారిన రోడ్లను అభివృద్ధి చేశాం. రక్షిత మంచినీటి పథకాలను పటిష్ఠపర్చి శుద్ధి చేసిన నీటిని సరఫరా చేస్తున్నాం. సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.2 కోట్లు అందించాం. రూ.9 కోట్లతో ఎన్‌ఆర్‌జీఎస్ పనులు చేపట్టాం. ఎన్ని కల్లో ఇచ్చిన ప్రధాన హామీలైన వశిష్ఠ వారధి, హార్బర్‌లపై దృష్టి పెట్టాం. ఇప్పటికే సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి తీసుకెళ్లాం. ఆక్వా యూనివర్శిటీని వచ్చే ఏడాదికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీర్ఘకాలంగా పెండింగ్‌లో వున్న కంపోస్టుయార్డు సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం. ఈ ఏడాది పాలనలోనే పెండింగ్ సమస్యలను కొలిక్కి తీసుకువచ్చాం నాలుగేళ్లలో వీటిని పూర్తి చేసే లక్ష్యంగా పనిచేస్తాం.

వారధి నిర్మించడమే నా కర్తవ్యం

పితాని సత్యనారాయణ, ఆచంట ఎమ్మెల్యే



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గంలో గోతులు లేని రహదారులను పూర్తిస్థాయిలో నిర్మించాం. రానున్న రోజుల్లో అన్ని గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాం. ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలను స్వీకరించాను. ప్రస్తుతం పల్లెపల్లెకు మన పితాని కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ఆయా గ్రామాల్లో సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. పశ్చిమగోదావరి, కోనసీమ జిల్లాలను కలుపుతూ కోడేరు నుంచి గన్నవరం వరకు వారధి నిర్మించడమే నా లక్ష్యం. రానున్న రోజుల్లో ఆచంటను సమస్యలు లేని నియోకజవర్గంగా తీర్చిదిద్దుతాను.

నారాయణపురం వంతెన నిర్మాణానికి కృషి

పత్సమట్ల ధర్మరాజు, ఉంగుటూరు ఎమ్మెల్యే



ఏడాది పాలనలో తీసుకున్న నిర్ణయాలు సంతృప్తినిచ్చాయి. నియోజకవర్గంలోని ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం, భీమడోలు మండలాల్లో పలు అభివృద్ధి పనులు నిర్వహించాం. రూ.56.83 కోట్లు వెచ్చించి 142.85 కి.మీ మేర రోడ్ల అభివృద్ధి చేశాం. రూ.17.35 కోట్లతో 35 రహదారుల మరమ్మతులు చేపట్టాం. సోషల్ వెల్ఫేర్ హాస్టళ్ల నాలుగింటికి రూ.14.53 లక్షలతో మరమ్మతులు చేయించాం. భీమడోలు హాస్టల్‌కు రూ.13.50 లక్షలతో మరమ్మతులు చేయిస్తున్నాం. 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.3.18 కోట్లతో 165 అభివృద్ధి పనులు చేశాం. నాబార్డు నిధులు నుంచి రెండు రహదారులకు రూ.2.45 కోట్ల మొత్తం వెచ్చించాం. భవిష్యత్తులో డెల్టా మెట్ట ప్రాంతాలను కలుపుతూ నారాయణపురం వంతెన నిర్మాణానికి కృషి చేస్తా.



కోకో గింజలను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

రైతులకు అండగా ప్రభుత్వం

నాణ్యమైన పంటల దిగుబడిపై రైతులు దృష్టి పెట్టాలి

జానంపేటలో కోకో రైతుల సమస్యలు తెలుసుకున్న రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు

పెదవేగి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రైతుకు ఏ కష్టం వచ్చినా ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు అన్నారు. జానంపేటలో కోకో రైతుల సమస్యలను తెలుసుకున్నారు. జిల్లాలో కోకో రైతుల సమస్యలను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చిన వెంటనే సమావేశం ఏర్పాటుచేసి కోకో గింజలను కిలో రూ.500 ధరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. వచ్చే ఏడాది నుంచి ఆయిల్‌పామ్‌కు గిట్టుబాటు ధర వంటి పాలసీని కోకో పంటకు కూడా అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి బుడితి రాజశేఖర్ మాట్లాడుతూ రైతుల నుంచి కోకో గింజల కొనుగోలుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ కోకో రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మిగిలిన పంట మొత్తాన్ని కొనుగోలు చేసిందన్నారు. వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు, వ్యవసాయశాఖ కమిషన్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ వెట్రిసెల్వి, ఉద్యానశాఖ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, దెందులూరు ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, వ్యవసాయశాఖ జేడీ హబీబ్ భాషా, ఉద్యానశాఖ డీడీ రామ్మోహన్, మైక్రో ఇరిగేషన్ పీడీ రవికుమార్, ఆర్డీవో అంబరీష్ పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పీ-4

పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పి4 పాలసీ దోహదపడుతుందని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. దుగ్గిరాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గొర్రెల కాపరి శ్రీను కుటుంబానికి పీ-4 విధానంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి వంద గొర్రెలను మంత్రి అందించారు. వంద గొర్రెలను తీసుకున్న వ్యక్తి ఏడాది పాటు పెంచి వాటి సంతతిని తాను తీసుకుని, ఏడాది తరువాత వంద గొర్రెలను తిరిగి ఎమ్మెల్యేకు ఇస్తాడు. వాటిని మరొక వ్యక్తికి పీ-4 విధానంలో అందిస్తారు. ఇదే విధానాన్ని మిగిలిన వారు కొనసాగించాలని మంత్రి సూచించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, ఎమ్మెల్యే బడేటి చంటి, దెందులూరు ఏఎంసీ చైర్‌పర్సన్ గారపాటి రామసీత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు సోలార్ విద్యుత్

ఏలూరు రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాలకు సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించనున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలినారు. ఏలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో రూ.35 లక్షలతో ఏర్పాటు చేసిన 50 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ సిస్టమ్‌ను ప్రారంభించారు. సోలార్ విద్యుత్‌కు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు.

సాఫీగా ఎస్జీటీల మాన్యువల్ కౌన్సెలింగ్

నేడు 900 మంది బదిలీ కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు



ఏలూరు అర్బన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక అవరోధాలతో తొలి రోజున అర్థాంతరంగా నిలిచిపోయిన సెకండరీగ్రేడ్ టీచర్ల (ఎస్జీటీ)ల మాన్యువల్ కౌన్సెలింగ్ బుధవారం గాడిన పడింది. మంగళవారం రాత్రి వాయిదా పడిన ఎస్జీటీల బదిలీ కౌన్సెలింగ్ బుధవారం నిర్ణీత షెడ్యూలు ప్రకారమే జరిగింది. మధ్యాహ్నం ఒంటిగంటకు మొదలైన కౌన్సెలింగ్ తొలుత ఏలూరు నగరపాలకసంస్థ యాజమాన్యానికి చెందిన ఎస్జీటీలకు నిర్వ హించగా మొత్తం 166 మంది కోరుకున్న స్థానాలకు బదిలీ అయ్యారు. తదుపరి ఉమ్మడి జిల్లాలోని ఆరు మున్సిపాల్టీల ఎస్జీటీలకు నిర్వహించగా 264 మంది బదిలీని ఖరారు చేసుకున్నారు. ఆ వెంటనే సాయంత్రం నుంచి ఉమ్మడి జిల్లాలోని జడ్పీ/ఎంపీపీ యాజమాన్యాలకు చెందిన ఎస్జీటీలు 100 మందికి కౌన్సెలింగ్‌ను ప్రారంభించగా మధ్యలో ఒక గంటపాటు ప్రిఫరెన్షియల్ కేటగిరీ వినియోగంపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో, వాటిని పరిష్కరించిన అనంతరం రాత్రి ప్రారంభించారు. కాగా గురువారం ఉదయం 8.30 గంటల నుంచి సీనియార్టీ జాబితాలో సీరియల్ నంబరు 101నుంచి 900 వరకు స్లాట్‌కు 300 మంది చొప్పున కౌన్సెలింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. ఎస్జీటీలు మొత్తం 2,239 మందికి కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. డీఈవో వెంకటలక్ష్మమ్మ, పశ్చిమ గోదావరి జిల్లా డీఈవో నారాయణ, డీవైఈవోలు, ఎంఈవోలు, ఏడీలు, సూపరింటెండెంట్లు పర్యవేక్షించారు.

గోదావరి తీరంలో పట్టుబడిన గంజాయి



కుక్కునూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కుక్కునూరు మండలం వింజరం గోదావరి రేవుకి అవతలవైపు ఉన్న అల్లూరి జిల్లా కూనవరం మండలం పోలిపాక వద్ద గంజాయితో బుధవారం ఒక యువకుడు పట్టుబడ్డాడు. కుక్కునూరు మండలం వింజరం గోదావరి తీరంలో మత్స్యకారులు చేపలు పడుతూ ప్రయాణికులను పడవలో గోదావరి అవలతల వైపు చేర వేస్తుంటారు.ఈ క్రమంలో అవతల నుంచి పడవదాటి కుక్కునూరు మండలం వైపు రావడానికి ఓ యువకుడు పులిపాక రేవు వద్ద బ్యాగుతో వచ్చాడు. మత్స్యకారులు అనుమానంతో అతని బ్యాగు చెక్ చేయగా పార్శిల్ రూపంలో ఉన్న గంజాయి ఉంది. ఆ యువకుడు పారిపోయే ప్రయత్నం చేయగా మత్స్యకారులు పట్టుకుని కూనవరం పోలీస్‌లకు సమా చారం ఇవ్వడంతో వారు అదుపులోకి తీసుకున్నారు. మూడునెలల క్రితం తెలంగాణలోని బుర్గంపాడు వద్ద పోలీసులు జరిపిన వాహనాల తనిఖీల్లో భారీగా పట్టుబడిన గంజాయి కూడా కుక్కునూరు మండలంలోని గోదావరి తీరంలోనే రేవుదాటి వచ్చినట్లు సమాచారం ఉంది.

రిమాండ్ ఖైదీ మృతి



ఏలూరు క్రైం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : గంజాయి కేసులో అరెస్టు అయి రిమాండ్ ఖైదీగా జిల్లా జైలులో ఉన్న యువకుడు అనారోగ్యానికి గురై విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. గణపవరం మండలం చిన్న రామచంద్రాపురానికి చెందిన ఏళ్ళ సాయికిషోర్‌ను (27) గంజాయి కేసులో ఈనెల 7న గణపవరం పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్ విధించడంతో ఏలూరు జిల్లా జైలుకు తర లించారు. అప్పటి నుంచి జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. అతను వచ్చిన రెండు రోజుల తరువాత జ్వరం రావడంతో జైలుకు సంబంధించిన వైద్యులు పరీక్షించి మందులు ఇచ్చారు. అవి వేసుకున్నప్పటికీ జ్వరం తగ్గకపోవడం, మరింత నీరసించి పోవడంతో బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో సాయికిషోర్‌ను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి పంపిం చారు. మధ్యాహ్నం వరకూ సాయికిషోర్‌కు వివిధ రకాల వైద్య పరీక్షలు చేయగా యూరిన్ క్రియేటిన్ ఎక్కువగా ఉందని, ఇన్‌ఫెక్షన్ కూడా ఉందని అతనికి సెరిబ్రల్ మలేరియా సోకినట్లుగా గుర్తించారు. అతను ఆసుపత్రిలోని కోమాలోకి వెళ్ళిపోవడంతో ఆక్సిజన్‌పై వైద్యం అందించి మెరుగైన చికిత్స కోసం విజయవాడకు తరలించారు. విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో మరణించాడు. అక్కడ కూడా వైద్య పరీక్షలు చేయగా సెరిబ్రల్ మలేరియా ఉన్నట్లుగా వైద్య పరీక్షల్లో గుర్తించారు. సాయికిషోర్ ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కువగా ఉంటాడని చెప్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. వైద్యులు ఎమ్మెల్సీగా నమోదుచేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటు ఏలూరు జిల్లా జైలు సూపరింటెండెంట్ స్వామికి కూడా సమాచారం ఇచ్చారు. మరోవైపు ఈ సంఘటనపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నారు.

రూ. 18 కోట్లు అప్పులు

తీర్చే మార్గం కానరాక ఆత్మహత్యాయత్నం

ఏలూరు క్రైం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : వడ్డీ వ్యాపారం చేస్తూ నష్టపోవడంతో అప్పులపాలయ్యాడు. వడ్డీ వ్యాపారం కోసం ఇతరుల వద్ద నుంచి తెచ్చిన 18 కోట్ల రూపాయలు బాకీ తీర్చేమార్గం కానరాక చివరకు వారి వేధిపులు భరించలేక పురుగుమంతు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఏలూరు శాంతినగర్‌లోని వీఎస్ఎల్ టవర్స్‌లో నివాసం ఉంటున్న విప్పగుంట అవినాష్‌కుమార్ (40) హైదరాబాద్‌లో ఒక ప్రైవేటు కంపెనీ నిర్వహించారు. మరో వైపు వడ్డీ వ్యాపారం చేశారు. వడ్డీ వ్యాపారానికి ఇతరుల నుంచి కూడా అప్పులు తీసుకువచ్చారు. తనకు ఉన్న ఆస్తులన్నీ ఇచ్చివేయగా ఇంకా 18 కోట్లు అప్పులు మిగిలాయి. వారి వేధింపులు భరించలేక హైదరాబాద్ నుంచి తిరిగి ఏలూరులోని శాంతినగర్‌కు కుటుంబంతో సహా వచ్చేశారు. 25 మందికి ఆయన సొమ్ములు ఇవ్వాల్సి ఉంది. వారంతా బాకీ కోసం ఒత్తిడి చేయడంతో బుధవారం బస్సులో బయలుదేరి కొవ్వూరువైపు వెళ్తూ మార్గమధ్యలో బుట్టాయిగూడెం వద్ద బస్సు దిగి పంట పొలాల్లో పురుగుమందు తాగి భార్యకు సమాచారం ఇచ్చాడు. దీంతో ఆమె బంధువులకు చెప్పడంతో అతనిని బుధవారం రాత్రి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదుచేసి ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈని బెదిరించిన వైసీపీ నాయకులపై కేసు నమోదు

నరసాపురం, రూరల్ జూలై 11 (ఆంధ్రజ్యోతి): నరసాపురం గ్రామీణ నీటి సరఫరా ఏఈ లోకేష్‌ను బెదిరించిన ముగ్గురు వైసీపీ నాయకులపై బుధవారం నరసాపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం ఏఈ లోకేష్ నరసాపురం మండలం వేములదీవి గ్రామంలోని సర్దుగడపలో మంచినీటి చెరువు రివిట్‌మెంట్ పనులు పరిశీలించేందుకు వెళ్ళారు.ఆ సమయంలో పనులు ఆగిపోవడంపై ఏఈ ఆరా తీశారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న తిరుమాని నాగరాజు ఆయనతో వచ్చిన మరో ఇద్దరు విధుల్లో ఉన్న ఏఈపై బెదిరింపులతో పాటు దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఏఈ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు.

11 ఏళ్లలో దేశం అసాధారణ పురోగతి : ఎంపీ పాకా

ఏలూరు రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): భారతదేశం 11 ఏళ్లలో అనేక రంగాలలో అసాధరణ పురోగతి సాధించిందని రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ అన్నారు. బీజేపీ పదకొండేళ్ల పాలనపై జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్ కిశోర్ అధ్యక్షతన బుధవారం ఏలూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీ స్థిరమైన పాలనతో దేశాన్ని గాడిలో పెట్టారని వివరించారు.ఏలూరులో వందేభారత్‌కు హాల్ట్ కల్పించాలని, కోకో రైతులకు మద్దతు ధర వచ్చేలా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యనారాయణరాజు, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు బి.నిర్మలా కిశోర్, సత్యనారాయణ, అశోక చక్రవర్తి, నెక్కంటి శ్రీని వాస్, కె.సుధాకర్ కృష్ణ, కట్నేని కృష్ణప్రసాద్ ఎంపీకి వినతిపత్రం అందించారు.



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి పొగాకు రైతుల సమస్యలు

జంగారెడ్డిగూడెం/పెదపాడు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వర్జీనియా పొగాకు రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా ప్రభుత్వం సహకరించాలని బుధవారం పెదవేగి మండలంలో పర్యటించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడుకు పొగాకు రైతులు వినతి పత్రం అందజేసినట్టు అల్లూరి ప్రసాద్ తెలిపారు. పెదవేగిలో జరిగే ఏరువాకలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి అచ్చెన్నాయుడుకు ఎమ్మెల్యే ప్రభాకర్, నియోజకవర్గ టీడీపీ శ్రేణులు స్వాగతం పలికి, అక్కడి నుంచి ర్యాలీగా తీసుకెళ్లారు. గారపాటి రామసీత, గుత్తా అనిల్, మరడాని రవి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం భేష్..

ద్వారకాతిరుమల : స్థానిక ప్రకృతి వ్యవసాయం తమను ఆకట్టుకుం టోందని ఇథియోపియా దేశస్థులు వ్యాఖ్యానించారు. ఇథియోపియా నుంచి పదిమంది సభ్యులతో కూడిన బృందం బుధవారం మండలంలోని గుండుగొలనుకుంటలో ప్రకృతి వ్యవసాయ పొలాన్ని సందర్శించారు.



పొలాలు పరిశీలిస్తున్న బృందం

ఎన్నడూ లేనంతగా అభివృద్ధిని చేసి చూపించాం



ఏలూరుటూటౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో ఎన్నడూలేనంత అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఆర్.ఆర్.పేటలో ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తైన సందర్భంగా ఫైలాన్ మేయర్ షేక్ నూర్జహాన్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ నగరంలో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కమిషనర్ ఏ.భానుప్రతాప్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, డిప్యూటీ మేయర్లు పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గాభవాని పాల్గొన్నారు.

సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు అవలంభించాలి

బుట్టాయగూడెం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): శాస్త్రవేత్తల సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించి రైతులు దిగుబడులను సాధించవచ్చని కేవీకే విస్తరణాధికారి డాక్టరు వి.దీప్తి తెలిపారు. కోయఅంకంపాలెం, పడమట రేగులకుంటలో బుధవారం జరిగిన వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో పాల్గొని పంటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులు, భూసార పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. పశుగ్రాస రకాలు, కోళ్లలో వచ్చే వ్యాధులు నివారణకు చర్యలు, పశువులకు టీకాలు వేయడం తదితర విషయాలను శాస్త్రవేత్త కె.నాగరాజకుమారి, విజయలక్ష్మి, మేరీరాణి వివరించారు. ఆయిల్ పాం సాగు రాయితీలపై శాస్త్రవేత్త రామచంద్రుడు వివరించారు. ఏవో డి.ముత్యాలరావు కూరగాయల సాగు, తేనెటీగల పెంపకం, పుట్టగొడుగులు, వర్మీ కంపోస్ట్ డ్రోన్ దీదీ పథకం గురించి వివరించారు. సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, పశువైద్య సహాయ అధికారి భాగ్య, శ్రీను పాల్గొన్నారు.

అప్పనవీడు ఆలయ షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం



పెదపాడు, జూన్11(ఆంధ్రజ్యోతి): అప్పనవీడు అభయాంజనేయ స్వామి దేవస్థానానికి చెందిన యనమదల రామస్వామి సత్రం ఆవరణలో రూ.29 లక్షలతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ బుధవారం ప్రారంభించారు. ఏఎంసీ ఛైర్మన్ గారపాటి రామసీత, దేవాలయ కమిటీ ఛైర్మన్ వేమూరి శ్రీనివాసరావులతో కలిసి పూజలు నిర్వహించారు. గుత్తా అనిల్, మరడాని రవి, వడ్డి వాసవి, మట్టా శ్రీనివాసరావు, బెక్కం లక్ష్మీనారాయణ, గరికిపాటి చంటి, సగ్గురి శ్రీనివాసరావు, వీరంకి మురళీ, దేవాలయ ఈవో తారకేశ్వరరావు పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న బొరగం

పోలవరం, జూన్11(ఆంధ్రజ్యోతి): జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మంచినీటి ట్యాంకుల నిర్మాణానికి ఏపీ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు శంకుస్థాపన చేశారు. మండలంలోని వింజరం, బోడిగూడెం, బండార్లగూడెం, గుంజవరం, ప్రగడ పల్లి, మనుగోపల, నాగంపాలెం, పేడ్రాల, రెడ్డి కుంకాల, సరిపల్లికుంట, ఎల్.ఎం. డి.పేట గ్రామాల్లో మంచినీటి ట్యాంకుల నిర్మాణానికి బుధవారం శంకుస్థాపనలు చేశారు. గురువారం తల్లుల ఖాతాల్లోకి నేరుగా తల్లికి వందనం నిధులు జమ చేయడం సీఎం చంద్రబాబు సుపరిపాలనకు నిదర్శనమన్నారు. కూటమి నాయ కులు బొడ్డు కృష్ణ, గునపర్తి చిన్ని, నునకాని రాంబాబు, పోతుల శ్రీను, సర్పంచ్ కె. వెంకటలక్ష్మి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ గంగరాజు, కొండలరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

మొబైల్లో శక్తియాప్ ఉంటే పోలీసులు వెంట ఉన్నట్టే

ఏలూరు క్రైం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మహిళల మొబైల్లో శక్తియాప్ ఉంటే పోలీసులు వెంట ఉన్నట్టేనని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ శక్తి టీమ్ పోలీసులు పేర్కొన్నారు. ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు పర్యవేక్షణలో ఎస్ఐ వి.క్రాంతిప్రియ వారి సిబ్బంది కలిసి ఏలూరు నగరంలోని కొత్త బస్టాండ్, వివిధ షాపింగ్ మాల్సలలో మహిళలకు విద్యార్థినులకు శక్తియాప్‌పై అవగాహన కల్పించి వారి ఫోన్లలో ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. ఈసందర్భంగా యాప్ వల్ల ఉపయోగాలను వివరించారు.

వసతి గృహాల్లో దోమల మందు పిచికారీ

భీమడోలు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): హాస్టల్ విద్యార్థులు వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని, అనారోగ్యం బారిన పడితే వైద్యులను సంప్రదించాలని ఏలూరు అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. భీమడోలు మండలం భీమడోలు, పోలసానిపల్లి హాస్టల్ సముదాయంలో దోమల నివారణ మందు పిచికారీని ప్రారంభించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జాహ్నవి ఆధ్వర్యంలో పంచాయతీ ఈవో కేవీఎస్ తనూజ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ బొత్స గంగరాజు, సూపర్‌వైజర్ రామకృష్ణ, హెల్త్‌అసిస్టెంట్ మురళీకృష్ణ, గోపాలకృష్ణ, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యండపల్లిలో ఏరువాక పౌర్ణమి

చింతలపూడి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): యండపల్లిలో ఏరువాక పౌర్ణమి వేడుకను ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించారు. రైతు గోపాలకృష్ణ కాడెద్దులకు పసుపు, కుంకుమతో పూజలు జరిపి నాగలితో పొలందున్నే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏలూరు జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారి ఎన్.ఎఫ్.ఎ.పి.హుస్సేన్ మాట్లాడుతూ నాగరికత ఎంత అభివృద్ధి చెందినా నాగలి కదలాల్సిందేనని అన్నారు. ఈ సందర్భంగా నాలుగు మండలాల నుంచి వచ్చిన 20 మంది ఉత్తమ రైతులను సన్మానించారు. కిసాన్ అంగడి బయో రిసోర్స్ సెంటర్, జాయిన్‌ఫర్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏరువాకను నిర్వహించారు. బి.నరసింహారావు, ఫ్రాన్సిస్, పుల్లారావు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం పరిశీలన

లింగపాలెం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించి తగిన న్యాయం జరిగేలా చూడాలని నూజివీడు సబ్‌కలెక్టర్ స్మరణ్ రాజ్ అన్నారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను ఆయన తనిఖీ చేశారు. కొణిజర్ల గ్రామానికి చెందిన గ్రామస్థులు కొందరు భూ సమస్యను సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. 1.75 ఎకరాల భూమిని దేవుడి మాన్యం భూమిని ఆక్రమించి తమపేరున మార్చుకున్నారని అందిన ఫిర్యాదు మేరకు సబ్‌కలెక్టర్ ఆరా తీశారు. సబ్ కలెక్టర్ స్మరణరాజ్ మాట్లాడుతూ భూమికి చెందిన రికార్డులను పరిశీలించి తనకు అందజేయాలని రికార్డులను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. తహసీల్దార్ నజీముల్లాషా, డీటీలు ప్రసాద్, నాగబాబు ఉన్నారు.

సన్న బియ్యాన్ని పరిశీలించిన సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

చింతలపూడి: పాఠశాలలు తెరుస్తున్న సందర్భంగా గురువారం ఇప్పటికే పాఠశాలలకు పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకానికి సన్న బియ్యం చేరుకున్నాయి. బుధవారం నూజివీడు సబ్ కలెక్టర్ చింతలపూడి నగర పంచాయతీలోని రెండు పాఠశాలలకు వెళ్లిన సన్నబియ్యాన్ని పరిశీలించారు. వచ్చిన మెటీరియల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు విద్యార్థులకు మంచిగా భోజనం అందించాలని సూచించారు. ఆయన వెంట చింతలపూడి తహసీల్దార్ ప్రమద్వర, ఎంపీడీవో మురళీకృష్ణ, ఎంఈవో కిరణ్‌బాబు, పలువురు పాల్గొన్నారు.

బడికి నవోదయం

(మూడో పేజీ తరువాయి)

విద్యార్థులకు తెలుగు, గణితం, పరిసరాల విజ్ఞానశాస్త్రం, ఆంగ్లం సబ్జెక్టులన్నింటికీ కలిపి ఒకే పాఠ్యపుస్తకాన్ని రెండు సెమిస్టర్లు (ఆరు నెలలకో సెమిస్టర్)గా విభజించి ముద్రించారు. ఆ ప్రకారం తొలి అర్ధసంవత్సర సెమిస్టర్‌కు సంబంధించిన పాఠ్యపుస్తకాలనే విద్యార్థి స్కూలుకు తెస్తే సరిపోతుంది. జిల్లావ్యాప్తంగా 20,486 మంది బాలబాలికలు బడిమధ్యలోనే మానేశారని గత మార్చిలో గుర్తించిన ప్రభుత్వం, ఆ మేరకు డ్రాపవు ట్లుగా తేల్చిన వారంతా ప్రస్తుతం ఎక్కడ ఉన్నారో, ఏం చేస్తున్నారో క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి, ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌తో వారిని మళ్లీ బడిలో చేర్పించాలని జిల్లా అధికారులకు ఆదేశాలు పంపింది.

పునర్వ్యవస్థీకరణ ప్రకారమే విధులు : వెంకట లక్ష్మమ్మ, డీఈవో

తొమ్మిది రకాల బడులకు అనుగుణంగా జిల్లాలోని ఉపాధ్యాయు లందరూ సోమవారం నుంచి ఆయా పాఠశాలల్లో విధులు నిర్వర్తిం చాలి. సోమవారం విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలను అందజేస్తారు. నూతన విద్యార్థులను చేర్చుకునేందుకు పాఠశాలలవారీగా ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను హెచ్ఎంలు, టీచర్లు నిర్వహించాలి.ఆరోతరగతి విద్యార్థులకు బ్రిడ్జికోర్సు తరగతులను నిర్వహించాలి. యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులందరితో యోగాసనాలను ప్రాక్టీస్ చేయించడం తోపాటు, విద్యార్థులను లీప్ యాప్‌లో రిజిస్ట్రేషన్‌చేసి అప్‌డేటెడ్‌గా ఉంచుకోవాలి.

ఏడాది పాలనలో మార్పులెన్నెన్నో

రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యి గురువారంతో ఏడాది పూర్తవుతోంది. ఈ నేపథ్యంలో ప్రజలు తమ అభిప్రాయాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. సీఎం చంద్రబాబు పాలన పట్ల హర్షం వెలిబుచ్చారు. ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు.

తల్లికి వందనం వేయడం సంతోషదాయకం
పి.నూకరాజు, రాజీవ్‌నగర్, జంగారెడ్డిగూడెం



జంగారెడ్డిగూడెం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రోడ్లకు మరమ్మతులు చేపట్టింది. గుంతలు లేకుండా రోడ్లను బాగుచేశారు. ఈ ప్రభుత్వంలో అందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయనే నమ్మకంతో ఉన్నాం. ఒక ఏడాదిలోనే ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు కృషి చేస్తున్నారు. వచ్చే నాలుగేళ్లలో అన్ని హామీలు అమలు చేస్తారు. తల్లికి వందనం చెప్పిన సమయానికి ఇచ్చేలా ప్రకటించడం సంతోషంగా ఉంది.

అమరావతిని పూర్తి చేస్తారనే నమ్మకం ఉంది
తాకాసి శ్రీను, శనివారపుపేట



ఏలూరు రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఎన్నో విజయాలు సాధించింది. ఇచ్చిన హామీల్లో ఉచిత గ్యాస్ సిలెండర్లు, రోడ్ల మరమ్మతులు, అన్న క్యాంటీన్లు, మత్స్యకారుల భరోసా, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, తల్లికి వందనం, పోలవరం పూర్తి చేయడానికి కేంద్రం నుంచి నిధులు తీసుకురావడానికి కృషి చేస్తోంది. అమరావతి నిర్మాణం పూర్తయితే ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. సీఎం ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు కృషి చేస్తారనే నమ్మకం ఉంది.

రోడ్లకు జీవం వచ్చింది : వి.నాగరాజు, కుక్కునూరు



కుక్కునూరు: పోలవరం నిర్వాసితులు ఎన్నో ఏళ్లుగా పునారవాస పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. ఈక్రమంలో రూ.850 కోట్లను కూటమి ప్రభుత్వం నిర్వాసితుల ఖాతాల్లో జమ చేసింది. దీంతో నిర్వాసితులకు మేలు జరిగింది. అలాగే గత ఐదేళ్లుగా రోడ్లు గోతుల మయంగా మారాయి. ఈ ప్రభుత్వం వచ్చి వాటిని సరిచేసి జీవం పోసింది.

మూలనపడ్డ పనులన్నీ జరుగుతున్నాయి..
కమ్మ నరేంద్ర, దొరసానిపాడు, రైతు



ద్వారకాతిరుమల: దీర్ఘకాలంగా మూలనపడిన ఎన్నో పనులు జరుగుతున్నాయి. గతంలో జరగని పనులు కూడా ఈ ఏడాదిలో చేపట్టి పూర్తి చేశారు. దాదాపు అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు డ్రైయిన్లు, కల్వర్టులు పనులు చేపట్టారు. అర్హులందరికీ సీఎం రిలీఫ్ ఫండ్ అందజేస్తున్నారు. గత ప్రభుత్వం 29 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే కూటమి ప్రభుత్వం 49 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతు ఖాతాలో సొమ్ము జమచేసింది. రైతుకు చంద్రబాబు బాసటగా నిలిచారనడానికి ఇదే కారణం..

రోడ్లు వచ్చాయి : ఎం.అరుణ, కొణిజర్ల



లింగపాలెం: గత ఐదేళ్లలో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేక మురుగునీరంతా ఇళ్లలోనే ఉండేది. సరైనరోడ్లు, డ్రైనేజీలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. రోడ్లపై నడవాలంటేనే భయంగా ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లో సీసీ రోడ్లు వచ్చాయి. మా పిల్లలకు అమ్మకు వందనం స్కూల్‌కు వెళ్లేలోపు వస్తుందన్నారు. ఇప్పటి వరకు వెలగని వీధిదీపాలు వెలుగుతున్నాయి.

పింఛన్ రూ.4 వేలు చేసిన ఘనత బాబుదే
పేరం వైదేవి, వృద్ధురాలు, రామారావుగూడెం



దెందులూరు: గత వైసీపీ ప్రభుత్వం వృద్ధులకు ఏడాదికి 250 పెంచి పింఛన్ ఇస్తే చంద్రబాబు ఒకే సారి ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా రూ.3 వేలను నాలుగు వేలు పెంచి ఇంటికి తెచ్చి అందిస్తున్నారు. రేషన్ బియ్యం సైతం వృద్ధులకు ఇంటికి తెచ్చి ఇవ్వడం బాగుంది.

రోగులు ఫుల్.. సౌకర్యాలు నిల్

భవనం నిర్మించినా సిబ్బంది లేరంటూ రోగుల ఆవేదన - వైద్యులను నియమించాలంటూ వేడుకోలు



నూతనంగా నిర్మించిన ప్రభుత్వ పెద్ద ఆస్పత్రి

దెందులూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వైద్య సేవల పట్ల తీవ్ర నిర్లక్ష్యం అవలంభించారని పలు విమర్శలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గ కేంద్రమైన దెందులూరులో గతంలో ఉన్న 30 పడకల ఆస్పత్రిని నూతన భవనం 2024లో నిర్మించారు.. అయితే వైద్యులను, నర్సులను, సిబ్బందిని, పారి శుధ్య కార్మికులను, సెక్యూరిటీ గార్డులను నియమించ డం మరిచారు. దీంతో సిబ్బంది, వైద్యులు లేక ప్రజలు పూర్తి స్థాయిలో వైద్య సేవలందడం లేదు. రోజుకు 160 నుంచి 200 మంది రోగులు ఆస్పత్రికి వస్తుంటారు. గత 15రోజుల్లో 2వేల 196 మంది వైద్య సేవలు పొందారు. 237 మంది ఆసుపత్రిలో చేరారు. ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా 96 మందికి సేవలందించారు. ఆసుపత్రిలో గైన కాలజిస్టు, జనరల్ ఫిజీషియాన్, మత్తుడాక్టర్, ఎంబీబీఎస్ డాక్టర్లు ఇద్దరు మాత్రమే ఉన్నారు.వస్తున్న రోగులకు సేవలందించాలంటే మరో నలుగురు వైద్యుల అవసరం ఉంది. ఉన్న డాక్టర్లు ఉదయం 9 నుంచి సా యంత్రం 4 గంటల వరకు మాత్రమే సేవలందిస్తారు. ప్రతి రోజూ ఒక్కరు మాత్రమే రాత్రి డ్యూటీలో ఉంటారు. పారిశుధ్య కార్మికులు 10 మందికి గానూ ఆరుగురు మాత్రమే ఉన్నారు. సెక్యూరిటీ గార్డులు ఆరుగురు ఉండాల్సింది.. నలుగురు మాత్రమే ఉన్నారు. ఇక నర్సులు 10 మందికి గానూ ఆరుగురు మాత్రమే ఉన్నారు. దీంతో ఉన్నవారికే వంతుల పద్ధతిలో విధులు కేటాయించారు. 60 పడకల స్థాయిలో ఆసుపత్రి భవనాన్ని నిర్మించి వైద్యులను, సిబ్బందిని నియమించకపో వడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అవ సరానికి తగిన విధంగా సిబ్బందిని నియమించి 24 గం టలు సేవలందించేలా కృషి చేయాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. అలాగే ఆస్పత్రికి ఎంతో ముఖ్య మైన జనరేటర్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నేత్ర వైద్యులను నియమించాలి
మద్దా భూషణం, సంఘ సేవకుడు, రామారావుగూడెం



ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో వైద్య సేవలందించేలా చర్యలు తీసుకోవాలి. గతంలో నేత్ర సంబంధిత సేవలందించేవారు.. ఇప్పుడు ఆ సేవలు లేవు. అడపాదడపా నేత్ర వైద్య శిబిరాలు మాత్రమే నిర్వహిస్తున్నారు. 30 పడకల ఆస్పత్రిని 100 పడకలకు అభివృద్ధి చేసినా సరిపడా సిబ్బందిని నియమించలేదు. అలాగే జనరేటర్‌ను ఏర్పాటు చేయాలి.

సిబ్బంది కొరతను అధికారులకు తెలిపాం
డాక్టర్ బి.సుందర్ బాబు, ప్రధాన వైద్యులు



ఆస్పత్రిలో అన్ని మందులు సరిపడా ఉన్నాయి. ఉన్న డాక్టర్లతోనే వంతుల పద్ధతిలో రోగులకు సేవలందిస్తున్నాం. జనరేటర్ లేకపోయిన ఇన్వెర్టర్‌తో సేవలందిస్తున్నాం. మరికొంత మంది డాక్టర్లు, సిబ్బంది అవసరం ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. గుండె నొప్పివస్తే చేసే రూ.40 వేల విలువైన ఇంజక్షన్‌లు సైతం దెందులూరు ప్రభుత్వ ఆసుపత్రిలో సిద్ధంగా ఉన్నాయి.

కుమార్తె అలిగిందని తల్లి ఆత్మహత్య

పెదవేగి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మందలించినందుకు కుమార్తె అలిగి గదిలోకి వెళ్లి తలుపులు వేసుకోవడంతో మనస్థాపానికి గురైన తల్లి విషం తిని ఆత్మహత్యకు పాల్పడింది. కొండలరావుపాలేనికి చెందిన కనపర్తి రేణుక భర్తతో విడిపోయి కుమార్తె రమ్య స్రవంతితో కలిసి ఉంటోంది. రమ్య స్రవంతి బీటెక్ వరకు చదివింది. చదువు విషయంలో ఈనెల 5న తల్లి రేణుక కుమార్తె రమ్యస్రవంతిని మందలించింది. దీంతో రమ్య స్రవంతి అలిగి గదిలోకి వెళ్లి గడియపెట్టుకుంది. రాత్రంతా తలుపు తీయకపోవడంతో మనస్థాపానికి గురైన తల్లి రేణుక విషం తిని అపస్మారక స్థితికి చేరుకుంది. దీంతో ఆమెను తొలుత ఏలూరు ఆంధ్రా హాస్పటల్‌కు తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యానికి హైదరాబాద్ నిమ్స్ హాస్పటల్‌కు తీసుకెళ్లారు. అక్కడ వైద్య ఖర్చులు భరించలేక తిరిగి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి రేణుక(40) మృతి చెందిందని పెదవేగి ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు.

ఇద్దరు పిల్లలతో తండ్రి అదృశ్యం

ఏలూరు క్రైం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవపడి తన ఇద్దరు పిల్లలతో భర్త వెళ్లిపోవడంతో ఆందోళనకు గురైన భార్య ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మోతేవారితోట ఏటిగట్టు ప్రాంతానికి చెందిన నెక్కిన దుర్గారావు (39)కి భార్య లక్ష్మి (35), కుమారులు మణిదీప్ సూర్యసాయి (10), నిహారిత్ సూర్యనారాయణ(7)లు ఉన్నారు. తరచుగా భార్యతో గొడవపడుతూ దుర్గారావు ఇంటి నుంచి వెళ్లిపోయి కొద్ది రోజుల తరువాత తిరిగి వస్తుంటాడు. ఈ ఏడాది ఏప్రిల్ 30న భార్యతో గొడవ పడ్డ దుర్గారావు తన ఇద్దరు కుమారులను తీసుకెళ్లిపోయారు. అతను తిరిగి వస్తాడని ఎంతగా ఎదురు చూసినా రాలేదు. బంధువుల ఇళ్లన్నీ వెతికినీ ఆచూకీ లభించలేదు. చివరకు లక్ష్మి ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కారుణ్య నియామకం

ఏలూరు క్రైం, జూన్ 11(ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో ఉన్న ఏఎస్ఐ అనారోగ్యంతో మరణించడంతో ఆయన కుమార్తెకు కారుణ్య నియామకం కింద జిల్లా పోలీస్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం కల్పిస్తూ ఎస్పీ కేపీఎస్ కిశోర్ నియామక పత్రాన్ని అందించారు. భీమవరం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న గోక ప్రసాదరావు అనారోగ్యానికి గురై 2020లో మరణించారు. ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన అమరుల కుటుంబాలను ఆదుకోవడం తమ ప్రధాన బాధ్యత అన్నారు. అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

పోలవరం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తరచూ గొడవపడుతున్నారని మనస్థాపంతో యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన పోలవరంలో బుధవారం చోటు చేసుకుంది. బీసీ కాలనీకి చెందిన పంతుల ఏసు అనే యువకుడు వైజాగ్‌లో కళాశాలలో చదువుతున్నాడు. మూడ్రోజుల క్రితం సెలవులకు ఇంటికి వచ్చాడు. తల్లిదండ్రులు తనమాటలు కూడా లెక్కచేయకుండా అస్తమానం గొడవపడుతున్నారనే కోపంతో బ్లేడుతో చెయ్యి కోసుకుని, గుర్తు తెలియని మందులు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితికి చేరిన యువకుడిని గమనించిన బంధువులు పోలవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం సిఫార్సు చేశారు.

హత్యాయత్నం కేసులో ఒకరి అరెస్టు

ఉంగుటూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఆస్తికోసం గొల్లగూడెంలో పినతల్లిపై హత్యాయత్నానికి పాల్పడిన దాసరి నాగేశ్వరరావును చేబ్రోలు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. తల్లి చనిపోవడంతో తండ్రి మునీశ్వరరావు వెంకటలక్ష్మిని రెండో వివాహం చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో పినతల్లితో ఆస్తి గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో 9వ తేదీన అర్ధ రాత్రి దాసరి వెంకట లక్ష్మిపై దాడి చేసి హత్యాయత్నం చేచేయబోయాడని పినతల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చేబ్రోలు ఎస్.ఐ. ఎం.సూర్య భగవాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఏడుగురిపై కట్నం వేధింపుల కేసు

టి.నర్సాపురం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం వేధిస్తున్న ఏడుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్.ఐ. జయబాబు తెలిపారు. టి.నర్సాపురం మండలం తిరుపతిపాడుకు చెందిన పోతన నాగదేవికి, ద్వారకాతిరుమల మండలం తూర్పుసాయంపాలెం గ్రామానికి చెందిన పోతన శివరామకృష్ణతో వివాహం అయ్యింది. వివాహ సమయంలో రూ.8 లక్షల కట్నం ఇచ్చారు. అదనపు కట్నం తీసుకురావాలని ఇటీవల వేధింపులకు పాల్పడటంతో నాగదేవి ఫిర్యాదుతో శివరామకృష్ణ, అతని కుటుంబ సభ్యులపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ. తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

జంగారెడ్డిగూడెం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): భర్త తిట్టడంతో మల్లెల్లి మనీషా(29) అనే వివాహిత మనస్థాపం చెంది విషంతాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన లక్కవరంలో చోటు చేసుకుంది. లక్కవరానికి మల్లెల్లి హనుమాన్ కుమార్‌కు అదే గ్రామానికి చెందిన మనీషాకు ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలున్నారు. ఈ నెల 9న భర్త తిట్టడంతో మనస్థాపం చెంది విషంతాగింది. బంధువులు రాజమండ్రిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు లక్కవరం ఎస్.ఐ. శశాంక కేసు నమోదు చేశారు. అయితే బంధువులు మాత్రం భర్తే హత్య చేశాడంటూ లక్కవరంలో మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి ఆందోళన చేపట్టారు.భర్త ఇక్కడకు రావాల్సిందేనంటూ డిమాండ్ చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి బుధవారం మృతి చెందాడు. భీమవరంలోని అన్నపూర్ణ థియేటర్ వద్ద ఈ నెల 10న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తి(45) తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో ఉన్నాడు. భీమవరం ప్రభుత్వాస్పత్రిలో వైద్యం అనంతం ఏలూరుకు తరలించగా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

చేపల చెరువులో పడి ఒకరి మృతి

ఏలూరు క్రైం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఏలూరు రూరల్ మండలం పోణంగి గ్రామ పరిధిలోని చేపల చెరువుపై పనిచేయడానికి మహారాష్ట్ర నుంచి వచ్చిన జైశ్వల్ జగదీశ్(40)ప్రమాదవశాత్తు చెరువులో పడి బుధవారం మృతి చెందాడు. చేపలకు మేత వేయడానికి రేకు పడవలో చేపల మేత వేసేందుకు వెళ్లి తిరిగి రాలేదు.. మిగతా వ్యక్తులు గుర్తించి గాలించేలోపు మృత దేహం లభించింది. ఎస్ఐ దుర్గా ప్రసాద్ కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృత దేహానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తహసీల్దార్‌గా నజీముల్లాషా

లింగపాలెం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్‌గా నజీముల్లాషా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ మండలంలో రెవెన్యూ సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. డీటీలు ప్రసాద్, నాగబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఏలూరుకు.. విజయ్ కుమార్‌రాజు

ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ మండల తహసీల్దార్‌గా విజయ్ కుమార్‌రాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసరావు దెందులూరు బదిలీపై వెళ్లారు. చాటపర్రు తహసీల్దార్ కార్యాలయంలో విజయ్ కుమార్‌రాజు బాధ్యతలు స్వీకరించారు. విజయ్ కుమార్‌రాజు ఇప్పటి వరకు కలెక్టరేట్‌లో సెక్షన్ సూపరింటెండెంట్‌గా పనిచేశారు. డిప్యూటీ తహసీల్దార్‌గా పద్మిని బాధ్యతలు స్వీకరించారు.

అర్బన్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా గాయత్రి

ఏలూరు రూరల్: ఏలూరు అర్బన్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా గాయత్రి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన శేషగిరి కలెక్టరేట్‌లో బదిలీపై వెళ్లారు. ఏలూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయ సూపరిండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న గాయత్రి అదనపు బాధ్యతగా ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు.

పెదవేగి సీఐగా రాజశేఖర్

పెదవేగి: సర్కిల్ ఇన్‌స్పెక్టర్(సీఐ)గా సి.హెచ్. రాజశేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రాజశేఖర్ ఏలూరులో క్రైం విభాగంలో సీఐగా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా పెదవేగి సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా పనిచేసిన కె.వెంకటేశ్వరరావు క్రైం పోలీస్ స్టేషన్ సీఐగా బదిలీపై వెళ్లారు.

వృద్ధులకు బాసటగా నిలవాలి : రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): జూలై 5న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో నిర్వహించనున్న రెండవ జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ పేర్కొన్నారు. ఈ నెల 15న ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రత్న ప్రసాద్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొని వృద్ధులకు బాసటగా నిలవాలన్నారు. వృద్ధులపై వేధింపులు, నిర్లక్ష్యం వంటివి నివారించాలన్నారు. అలాగే జూలై 5న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ కుదుర్చుకోదగ్గ కేసులను పరిష్కరించుకోవాలన్నారు. కేసులను పరిష్కరించుకోవడంలో సమస్యలు ఎదురైతే (15100),(08812-224555) సంప్రదించాలని సూచించారు.

17న క్రికెట్ ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 17న భీమవరంలోని డీఎన్నార్ కళాశాల మైదానంలో అండర్-16 పురుషుల క్రికెట్ జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు ఆర్ఎస్ఆర్ మూర్తి, అశోక్ కుమార్ గౌడ, షేక్ షాకీర్ హుస్సేన్ తెలిపారు. కళాశాల మైదానంలో ఉదయం 9 గంటలకు ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. ఎంపికైన క్రీడాకారులు జూలై 3 నుంచి 13వ తేదీ వరకు మంగళగిరిలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే సెంట్రల్ జోన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీల్లో ప్రాతినిథ్యం వహిస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు తెల్లటి యూనిఫారం, సొంత క్రికెట్ కిట్టుతో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. 2009 సెప్టెంబర్ ఒకటో తేదీ తరువాత జన్మించిన వారే అర్హులని, ఒరిజనల్ జనన, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్ తీసుకురావాలన్నారు. మరింత సమాచారానికి (90002 44892) సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

28వ రోజుకు గిరిజనుల దీక్షలు

బుట్టాయగూడెం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం చేయాలని, ఏజెన్సీకి ప్రత్యేక డీఎస్సీని ప్రకటించాలని, గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆదివాసీలు చేపట్టిన రిలే దీక్షలు బుధవారానికి 28వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో మహిళా టీచర్లు కె.ధనలక్ష్మి, టి.జానకి, కె.ద్రౌపతి, నాయకులు పైదా పోతురాజు, రవ్వ బసవ రాజు, పూసం శ్రీను, కుంజా రమేష్, ఎం.కన్నప రాజు, సోదెం ముక్కయ్య పాల్గొన్నారు.

అల్లూరి ఇంద్ర కుమార్ ఏకగ్రీవం

ఏలూరు అర్బన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి) : సీఆర్ఆర్ విద్యాసంస్థల పాలక వర్గ అధ్యక్షుడిగా డాక్టర్ అల్లూరి ఇంద్రకుమార్ ఏకగ్రీవంగా నాల్గవ పర్యాయం ఎన్నికయ్యారు. బుధవారం ఏలూరులో జరిగిన పాలకవర్గ సర్వసభ్య సమావేశంలో జరిగిన ఎన్నికల వివరాలను ఎలక్షన్ ఆఫీసర్ వంకినేని పూర్ణచంద్రరావు మీడియాకు వివరించారు. నూతనంగా ఎన్నికైన ఇంద్రకుమార్ మాట్లాడుతూ జనరల్ బాడీ సభ్యుల సహాయ సహకారాలతో సీఆర్ఆర్ విద్యాసంస్థలను యూనివర్సిటీ స్థాయికి తీసుకెళ్లడానికి శాయశక్తులా ప్రయత్నిస్తానన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఏలూరుకార్పొరేషన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఆహార ఉత్పత్తులను పండించే రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని రకాలుగా ఆదుకోకపోతే ఆహార ప్రమాదం పొంచి ఉందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించకపోతే నష్టపోతారని, తద్వారా వ్యవసాయాన్ని సాగించేందుకు రైతులు ఆసక్తి చూపరని, ఆహార ఉత్పత్తులకు కొరత ఏర్పడుతుందన్నారు. రైతులను ఎంత ప్రోత్సహిస్తే మరింత ఉత్పత్తులు పెరుగుతాయని, సమాజంలో ఆహార కొరత ఏర్పడదని స్పష్టం చేశారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెదవేగి, జూన్ 11(ఆంధ్రజ్యోతి) : జానంపేట విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఈఈ కేఎం.అంబేద్కర్ తెలిపారు. జానంపేట, జగన్నాథపురం, బి.సింగవరం ముత్తనవీడు గ్రామాల్లో విద్యుత్ సరపరాకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

చాటపర్రు సెక్షన్ పరిధిలో..

ఏలూరు రూరల్: చాటపర్రు సెక్షన్ పరిధిలోని గుడివాకలంక సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా ఈ నెల 13న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గుడివాకలంక, మొండి కోడు, ప్రత్తికోళ్ళలంక, పైడిచింతపాడు, కొక్కిరాయిలంక,కోమటిలంక, పెదయాగనమిల్లి, చినయాగనమిల్లి, చాటపర్రు టౌన్‌లో చెట్లు కొమ్మల తొలగింపు కారణంగా చాటపర్రు, చాటపర్రు రోడ్డు, బాలాజీ నగర్, వినాయక నగర్, ఏరియా పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని అంబేద్కర్ తెలిపారు.

13న నారాయణపురం పరిధిలో

ఉంగుటూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నారాయణపురం సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 13న మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని అంబేద్కర్ తెలిపారు. నారాయణపురంలోని ఐస్ ఫ్యాక్టరీలకు రాచూరు, రావులపర్రు, సీతారాంపురం గ్రామాలకు విద్యుత్ ఉండదన్నారు.

కార్మిక చట్టాలు అమలు చేయాలి

కొయ్యలగూడెం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలను సమగ్రంగా అమలు చేయాలని ఏపీ గిరిజన రాష్ట్రకార్యదర్శి, సీపీఐ నాయకులు కారం దారయ్య కోరారు. ఈ మేరకు బుధ వారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాలో మండల సీపీఐ కార్యదర్శి తాడిగడప అంజనేయరాజు,చింతలపూడి దుర్గారావు, నారాయణరావు పాల్గొన్నారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

ఏలూరు టూటౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కర వేదిక గురువారం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ఎంపీ క్యాంపు కార్యాలయంలో ప్రజలు నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకుంటారు. అనంతరం నగరంలో పర్యటిస్తారు.

రోడ్డుకు రూ.85 లక్షలు మంజూరు

ద్వారకాతిరుమల, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు అధ్వానంగా ఉన్న రహదారిని కొత్త బీటీ రోడ్డుగా మలిచేందుకు నిదులు మంజూరయ్యాయి. దీంతో బుధవారం పనులు ప్రారంభమయ్యాయి. జాతీయ రహదారి నుంచి బుట్టాయగూడెం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు కృషితో రూ.85 లక్షలు మంజూరయ్యాయి. రోడ్డు నిర్మాణంలో అడ్డంకులు లేకుండా రోడ్డు సర్వే చేయించి ఆక్రమణలు తొలగించే విస్తరణ పనులను సర్పంచ్ కేత సుబ్రహ్మణ్యం, కేత గౌరేశ్వరరావులు ప్రారంభించారు. మండలాధ్యక్షుడు లంకా సత్యనారాయణ మాట్లాడుతూ పనులు చేపట్టి త్వరలో పూర్తి చేస్తామన్నారు.

మద్ది క్షేత్రంలో సినీ ప్రముఖులు

జంగారెడ్డిగూడెం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): గురవాయిగూడెం మద్ది అంజనేయ స్వామిని ప్రముఖ సినీ దర్శకుడు (వకీల్ సాబ్)ఫేం శ్రీరామ్ వేణు,సినీ ఫోటో గ్రాఫర్ (అతడు, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు ఫేం)గుహన్, ఆదిత్య ఫిలిమ్స్ డిస్ట్రిబ్యూటర్ ఎల్.వెంకటేశ్వరరావు, రాంబాబు బుధవారం దర్శించుకున్నారు. ఆలయ మండపంలో వేద పండితులు ఆశీర్వచనం అందజేశామని, వారితో పాటు అభిమానులు పాల్గొన్నట్టు ఈవో ఆర్‌వి.చందన తెలిపారు.

నేడు కూటమి విజయోత్సవం

కైకలూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కాలం పూర్తయిన సందర్భంగా గురువారం కైకలూరు తాలుకా సెంటర్లో వేడుకలను జరపనున్నట్లు నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు తెలిపారు. ఉదయం 10 గంటలకు తాలుకా సెంటర్లో కేక్ కట్ చేసి విజయోత్సవాన్ని నిర్వహిస్తామని కూటమి నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

హెల్మెట్ ధారణపై నిర్లక్ష్యం వద్దు : ఎస్‌ఐ శుభాకర్



ఆగిరిపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వాహనం నడిపే సమయంలో హెల్మెట్ ధారణపై నిర్లక్ష్యం వద్దనీ ఎస్‌ఐ శుభాకర్ తెలిపారు. ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గల సింగన్నగూడెం వద అవగాహన సదస్సు నిర్వహించారు. రాంగ్ రూట్లో వాహనం నడపవద్దని సూచించారు. హెల్మెట్ పెట్టుకోకుంటే భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

ఏడాది పాలన అత్యంత సంతృప్తికరం

మంత్రి కొలుసు పార్థసారథి



నూజివీడు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఒక ఆర్థిక నేరస్థుడి చేతిలో విధ్వంసమైన ఈ రాష్ట్రాన్ని అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు తీర్చిదిద్దుతున్నారు. ఏడాది పాలన అత్యంత సంతృప్తి కరంగా ఉందని నూజివీడు ఎమ్మెల్యే, మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికార పట్టాలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం సంక్షేమం మా బ్రాండ్ అంటూ రూ. 61,000 వ్యక్తిగత ఆర్థిక సాయం అందించామని గొప్పలు చెబుతోందని, చంద్రబాబు ప్రభుత్వం ఈ ఏడాది రాష్ట్ర అభివృద్ధితో పాటు వ్యక్తిగతంగా ఇప్పటికే రూ.88,000 చొప్పున ఆర్థిక సాయం వివిధ పథకాలు ద్వారా అందించారన్నారు. నూజివీడు నియోజకవర్గంలో రూ. 25 కోట్లు రహదారులకు, రూ. 22 కోట్లు ఉపాధి పనులకు ఖర్చుచేశాం. కొమ్మూరు వద్ద రూ. 150 కోట్లతో స్టార్చ్ తయారీ కర్మాగారం, తోటపల్లి వద్ద గ్యాస్ తయారీ కర్మాగారానికి అనుమతులకు ఇవ్వడం జరిగింది. వీటికి త్వరలో శంకుస్థాపన జరగనున్నట్టు, తద్వారా నియోజకవర్గంలో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. తొలి ఏడాది వివిధ అభివృద్ధి పనులకు, విధి సంక్షేమ పథకాలకు, నియోజకవర్గానికి ప్రభుత్వం నుంచి అందిన నిధులు రూ. 283 కోట్లు అని, వివిధ అభివృద్ధి పథకాల కింద రూ. 113.82 కోట్లు, వివిధ రకాల పెన్షన్లు కింద రూ. 170 కోట్ల అందాయని తెలిపారు.

నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి

ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్



కైకలూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మౌలిక వసతుల కల్పనతో ప్రభుత్వ నిధులతో పాటు సొంతంగా మరికొన్ని నిధులను ఖర్చు చేసి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి దిశగా నడిపించడం సంతృప్తి నిచ్చిందని కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉపాధి నిధులు రూ.32 కోట్లతో సీసీ రోడ్లు నిర్మించామన్నారు. 30 ఏళ్ల కాలంలో డ్రెయిన్ల ఆధునికీకరణ జరగకపోవడంతో సొంతంగా రెండు పంటులను కొనుగోలు చేసి వాటి ద్వారా డ్రెయిన్లలో కిక్కస, తూడు తొలగిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇచ్చే నిధుల కంటే కోటి రూపాయిలు పైనే అదనంగా ఖర్చు అవుతుందని అయినప్పటికీ నియోజకవర్గంలో ఎక్కడా కూడా పనులు నిలుపుదల చేయకుండా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆక్వా రంగం అభివృద్ధికి రాయితీపై విద్యుత్, అందించడం కొత్తగా నాలుగు చోట్ల సబ్‌స్టేషన్ల నిర్మిస్తున్నామని, ఇప్పటికే గోపవరంలో నిర్మాణం జరుగుతోందన్నారు. కొల్లేరుకు శాశ్వత పరిష్కారాన్ని అందించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నామన్నారు. సంవత్సర పాలనలో రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం సేవలు అభినందనీయమని దుష్టపరిపాలన పోయి ప్రజలు స్వేచ్ఛగా జీవించడమేగాక అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టు ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్మాణాలు జరుగుతున్నాయని దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ ఖ్యాతి వీటి నిర్మాణంతో పెరుగుతుందన్నారు.

క్రీడాకారుల కల.. సాకారమవుతున్న వేళ

▸▸30 ఏళ్ల తరువాత ఇండోర్ స్టేడియం పనులకు మోక్షం

▸▸రూ. 1.80 కోట్లు మంజూరు చేయించిన మంత్రి పార్థసారథి ▸▸ రేపు పనులు ప్రారంభం

నూజివీడు బాస్కెట్‌బాల్, టెన్నికాయిట్, చెడుగుడు క్రీడలకు ప్రసిద్ధి. ఈ క్రీడల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులకు నూజివీడు పుట్టినిల్లు. నూజివీడులో ఎలాంటి సదుపాయాలు లేకున్నా అనేక మంది క్రీడాకారులు కాలేజీ, హైస్కూళ్లలోని స్థలాలను ఉపయోగించుకొని తమ క్రీడా నైపుణ్యాన్ని పెంచుకున్నారు. బాస్కెట్‌బాల్ రాష్ట్ర, జిల్లా స్థాయి టీంలు సైతం నూజివీడులో ఎంపికయ్యేవి. అయితే క్రీడాకారులను ప్రోత్సహించేందుకు 30 ఏళ్ల క్రితం శంకుస్థాపన చేసిన ఇండోర్ స్టేడియం నిర్మాణం మధ్యలోనే ఆగింది. ఇప్పుడు మంత్రి పార్థసారథి రూ. 1.80 కోట్లు నిధులు మంజూరు చేయించారు. శుక్రవారం పనులకు శ్రీకారం చుట్టనున్నారు.



మధ్యలో ఆగిపోయిన ఇండోర్ స్టేడియం

నూజివీడు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులను ప్రోత్సహించడానికి సుమారు 30 ఏళ్ళ క్రితం నాటి నూజివీడు ఎమ్మెల్యే, మంత్రి అయిన పాలడుగు వెంకటావ్రు నాటి సీఎం నేదురమల్లి జనార్దనరెడ్డితో నూజివీడులో ఇండో స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేయించారు. అయితే కొద్ది నెలలకే జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం మారిపోవడంతో స్టేడియం నిర్మాణానికి రాజకీయ గ్రహణం పట్టింది. 12 ఏళ్ల క్రితం పాలడుగు వెంకట్రావు ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు తిరిగి ఈ స్టేడియం నిర్మాణానికి కొంత నిధులు రాబట్టారు. రెండేళ్ళ పాటు పలు నిర్మాణ పనులు జరిగాయి. తిరిగి నిధులు కొరత ఏర్పడటంతో పాటు రాజకీయ గ్రహణం మళ్ళీ ఏర్పడింది. కాంగ్రెస్ పార్టీలో దివంగత మంత్రి పాలడుగు వెంకట్రావుకు అనుంగు శిష్యుడిగా పేరొందిన పార్థసారథి 2024లో ఎమ్మెల్యేగా నూజివీడు నుంచి టీడీపీ తరఫున పోటీ చేసి విజయం సాధించి మంత్రి అయ్యారు. మధ్యలో ఆగిపోయిన ఈ స్టేడియం నిర్మాణానికి త్వరలో నిధులు సాధించి పూర్తి చేయించి అందిస్తానని స్థానిక క్రీడాకారులకు హామీ ఇచ్చారు. పలు మార్లు క్రీడాశాఖతో సంప్రదింపులు జరిపి ఎట్టకేలకు రూ. కోటి 80 లక్షల నిధులు సాధించారు. శుక్రవారం నిర్మాణ పనులు ప్రారంభానికి ఆయన స్వయంగా శ్రీకారం చుట్టనున్నారు. దీంతో నూజివీడు క్రీడాకారుల చిరకాలమైన ఇండోర్ స్టేడియం త్వరలో అందుబాటులోకి రానుంది.

వెల్లువెత్తిన వినతులు

ముదినేపల్లి ఫిర్యాదుల వేదికలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎంపీ



ముదినేపల్లిలో అర్జీలు స్వీకరిస్తున్న ఎంపీ మహేష్‌కుమార్

ముదినేపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలో బుధవారం ఎంపీ మహేష్‌కుమార్ కైకలూరు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యలు వెల్లువెత్తాయి. నాలుగు మండలాలకు చెందిన పలువురు ఆయనకు అర్జీలు అందజేశారు. వడాలిలో ఇళ్ళ పక్కనే నిర్వహిస్తున్న సిమెంటు కార్ఖానా వల్ల దుమ్ము, ధూళి, గృహాల్లోకి వస్తుందని ఆ కార్ఖానా తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన ఓ మహిళ, ఆమె కుమారుడు ఎంపీకి వినతిపత్రం అందజేశారు. దీనిని వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్, ఎంపీడీవోలను ఎంపీ మహేష్ ఆదేశించారు. ముదినేపల్లిలో అంబేడ్కర్ భవనాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సేవా నాగజగన్‌బాబూరావు కోరారు. బొమ్మినంపాడు పంచాయతీ ఏరియాలో సీసీ రోడ్ల నిర్మాణానికి, తాగునీటి సౌకర్యం కల్పించేందుకు నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ దారం సుధ ఎంపీని కోరారు. అన్నవరం డ్రెయిన్‌ను తవ్వించాలని వివిధ గ్రామా ల రైతులు వినతి పత్రం అందజేశారు. మండవల్లి మండలం లోని పలు గ్రామాల మహిళ లు తమకు పెన్షన్లు మంజూరు చేయ లేదని ఫిర్యాదు చేయ డంతో సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ నియోజక వర్గంలో ఇరిగేషన్, డ్రైనేజీ వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. పామర్రు- దిగమర్రు జాతీయ రహదారి పనులను వేగంగా నిర్వహించాలని పలువు రు కోరారు. ఎస్‌ఐ వీరభద్రరావు పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

20 ఏళ్లుగా స్థలాలివ్వడం లేదు..

మండవల్లి: మండవల్లిలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాం అంటున్నారే కానీ అప్పగించడం లేదని లబ్ధిదారులు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్‌కు ఫిర్యాదు చేశారు. ముదినేపల్లిలో బుధవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదికలో ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2006లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలను గుర్తించి 131 మందికి స్థలాలు మంజూరు చేసిందని, ఇళ్ల నిర్మించి లబ్ధిదారులకు అందించాలని పట్టాలను గృహ నిర్మాణ శాఖకు అప్పగించిందని, అప్పటి నుంచి ఆ స్థలాల అభివృద్ధిని ఎవరూ పట్టించుకోలేదని, 20 ఏళ్లుగా కలెక్టర్ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఎవరూ పట్టించుకోలేదని ఆరోపించారు. 20 ఏళ్లుగా లబ్ధిదారులు ఇబ్బందులు పడుతుంటే మీరు ఎందుకు పట్టించుకోలేదని అధికారులను ఎంపీ ప్రశ్నించారు. సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులు సుజాత, బుజ్జమ్మ, లక్ష్మీ, పద్మ, నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

షాదీఖానా నిర్మించరూ..

కలిదిండి: కలిదిండిలో షాదీఖానా భవనం శిథిలావస్థకు చేరిందని నూతన భవనం నిర్మించాలని కలిదిండి ముస్లిం, టీడీపీ నాయ కులు బుధవారం ముదినేపల్లిలో నిర్వహించిన ప్రజావేదికలో పాల్గొన్న ఎంపీ పుట్టా మహేష్‌కి వినతిపత్రం అందజేశారు. సుమారు 18 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం ఇరుకుగా ఉండటంతో ఇబ్బందిగా ఉంటుందని ఎంపీ నిధులతో విశాలమైన షాదిఖానా నిర్మించాలని కోరగా, అందుకు ఎంపీ సానుకూలంగా స్పందించారని టీడీపీ నాయకులు అంద్రాజు శ్రీనివాస్, లంకా రత్నారావు తెలిపారు. షాదిఖానా చైర్మన్ ఫారుక్, చిన్న భద్రి, రహమతుల్లా, హయాక్ ఖాన్ పాల్గొన్నారు.

అమరావతిపై వైసీపీ కుట్రలు : ఎంపీ మహేశ్

ముదినేపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాజధానిని ప్రపంచ స్థాయిలోనే అద్భుతంగా నిర్మించాలని కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రతిబంధకాలను సృష్టించాలని వైసీపీ ప్రయత్నిస్తున్నదని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ విమర్శించారు. ముదినేపల్లిలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అమరావతిని వేశ్యల రాజధాని అంటూ ఆ పార్టీకి చెందిన ఛానల్‌లో డిబేట్ నిర్వహించటమే ఇందుకు సాక్ష్యమన్నారు. అమరావతిపై విషం చిమ్మే దుష్ట ప్రయత్నాలను వైసీపీ నాయకులు విరమించుకోవాలన్నారు. ప్రధాని మోదీ సహకారంతో అమరావతి నిర్మాణాన్ని చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పూర్తి చేయడం ఖాయమని ఎంపీ మహేష్ అన్నారు.

పాఠశాలలకు సన్న బియ్యం

చాట్రాయి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వం సరఫరా చేసిన సన్న బియ్యాన్ని స్కూల్స్‌కి పంపిణీ చేసినట్లు ఎంఈవో వీఎస్‌వీ బ్రహ్మాచారి తెలిపారు. మండలంలోని 63 పాఠశాలలకు 5,325 కిలోల సన్న బియ్యం, 124 కిలోల రాగి పిండి, 125 కిలోల బెల్లం పంపిణీ చేశామని, మండలంలో అన్ని పాఠశాలలో 2,610 మంది విద్యార్థులకు 12,743 పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు 14,500, స్కూల్ బ్యాగ్స్ కూడా పంపిణీ చేశామని, ఇంకా యూనిఫామ్, షూస్ రావల్సి ఉన్నదని ఎంఈవో చెప్పారు.

రేపు మండల పరిషత్ సమావేశం

ముదినేపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 13న జరుగుతుందని ఎంపీడీవో వై.రామకృష్ణ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సత్యనారాయణ అధ్యక్షతన జరుగుతుందని తెలిపారు.



ట్రాన్స్‌కో సిబ్బందితో మాట్లాడుతున్న విజిలెన్స్ ఈఈ విజయకుమారి

విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

రూ. 3.04 లక్షల జరిమానా

ముసునూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చౌర్యానికి పాల్పడితే భారీ జరిమానాతోపాటు చట్టపరంగా చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ఈఈ పి.విజయకుమారి హెచ్చరించారు. బుధవారం రమణక్కపేట సెక్షన్ పరిధిలోని గ్రామాల్లో నూజివీడు ఈఈ సత్యనారాయణ, విజిలెన్స్ ఈఈ విజయకుమారి ఆధ్వర్యంలో 20 మంది అధికారులు, 52 మంది సిబ్బంది 42 బృందాలుగా 3120 సర్వీసులను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ముగ్గురికి రూ. 18వేలు, నిబంధనల ప్రకారం లోడ్ కంటే అదనంగా విద్యుత్‌ను వాడుతున్న 143 మందికి రూ 2,86,000లు అపరాధ రుసుం విధించినట్లు విజిలెన్స్ ఈఈ విజయకుమారి తెలిపారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారి సమాచారాన్ని 83310 20537, 94931 74284 నంబర్లుకు వాట్సాప్ ద్వారా తెలపాలని కోరారు. తనిఖీల్లో డిప్యూటీ ఇంజినీర్లు, ఏఈలు, ఎల్‌ఐలు పాల్గొన్నారు.

కేరళ నవోదయకు ఈదర విద్యార్థి ప్రశాంత్



ఆగిరిపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఈదర గ్రామానికి చెందిన బెక్కం శివనాగ ప్రశాంత్ కేరళలోని కొట్టాయంలో గల నవోదయ విద్యాలయకు ఎంపికయ్యాడు. ప్రాథమిక విద్యాభ్యాసం ఈదర పాఠశాలలో పూర్తిచేసి, ఆరో నుంచి పదో తరగతి వరకు వేలేరులో గల జవహర్ నవోదయ విద్యాలయంలో పూర్తి చేశాడు. 10వ తరగతి నందు 461 మార్కులు సాధించాడు. జవహర్ నవోదయ విద్యాలయాల్లో 10వ తరగతిలో ప్రతిభ కలిగిన విద్యార్థులకు నిర్వహించిన పరీక్షల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన ప్రశాంత్ ప్లస్ 1, ప్లస్ 2, ఐఐటీ కోచింగ్‌కు ఎంపికయ్యాడు. ప్రశాంత్ మాట్లాడుతూ ఐఐటీ ముంబైలో సీటు సాధించడం తన లక్ష్యమని తెలిపారు.

తప్పిపోయిన వృద్ధురాలు కుటుంబీకుల చెంతకు..

ముదినేపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం కోమర్రులో గుర్తు తెలియని వృద్ధురాలి ఆచూకీ తెలుసుకుని ఆమెను ముదినేపల్లి పోలీసులు ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు. గ్రామంలో గుర్తుతెలియని వృద్ధురాలు ఉందని గ్రామస్థులు పోలీసులకు తెలపడంతో పోలీసులు మంగళవారం రాత్రి వృద్ధురాలిని వివరాలడిగారు. తన పేరు వెన్నకోట రావమ్మ అని, తన గ్రామం గుడ్లవల్లేరు మండలం కవుతరం అని చెప్పింది. సమాచారాన్ని గుడ్లవల్లేరు పోలీసులకు ముదినేపల్లి ఎస్‌ఐ వీరభద్రరావు తెలియజేయగా ఆమె కనిపించడం లేదని తమకు ఫిర్యాదు అందిందని తెలిపారు. వృద్ధురాలి ఆచూకీ తెలియడంతో ఆమెను ముదినేపల్లి, గుడ్ల వల్లేరు పోలీసులు ఆమె కుమారులకు అప్పగించారు.

మామపై అల్లుడు కత్తితో దాడి

ముదినేపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం నరసన్నపాలెంకు చెందిన శేషు కుమార్‌కు, కోడూరు గ్రామానికి చెందిన సాధ్వినితో చాలా కాలం క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక పాప. కుటుంబ కలహాలతో కొంత కాలంగా సాధ్విని కోడూరులోని తన పుట్టింటి వద్దే ఉంటోంది. మంగళవారం రాత్రి శేషుకుమార్ తన కుమార్తెను చూసేందుకు కోడూరు వెళ్ళగా అక్కడ మావ నాగరాజుతో గొడవ జరిగింది. ఆవేశంలో కత్తితో శేషు కుమార్ మామ తలపై కొట్టడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే నాగరాజును గుడివాడ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి ఎస్‌ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	

అన్నదాతలకు సిరులు పండాలి



జనార్ధవరంలో మంత్రి పార్థసారథి ఏరువాక పూజలు

చాట్రాయి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వరుణదేవుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిసి అన్నదాతలకు సిరులు పండాలని గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆకాంక్షించారు. మండలంలోని జనార్ధనవరంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం మంత్రి ఏరువాక పౌర్ణమి పూజలు చేసి అరక దున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రూ. 3.05 కోట్లతో 875 మంది రైతులకు ఆధునిక వ్యవసాయ పరికరాలు అందజేశామన్నారు. జిల్లాలో 40 రైతుల గ్రూపులకు రూ. 3.20 కోట్ల విలువైన డ్రోన్లు, నూజివీడు నియోజకవర్గంలో 4 రైతు గ్రూపులకు రూ. 32 లక్షల విలువైన డ్రోన్లు అందజేశామన్నారు.

రహదారికి శంకుస్థాపన...

జనార్ధనవరం- తుమ్మగూడెం గ్రామాల మధ్య రూ. 2 కోట్ల నాబార్డు నిధులతో నిర్మించనున్న రహదారి పనులకు మంత్రి పార్థసారథి శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్ల అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిచ్చామన్నారు.

పలువురికి మంత్రి పరామర్శ

ఇటీవల గాలివానకు చాట్రాయి, ఆరుగొలనుపేట గ్రామాలలో దెబ్బతిన్న ఇళ్లను మంత్రి సారథి పరిశీలించారు. వ్యక్తిగతంగా ఆర్థిక సాయం అందజేశారు. నిత్యావసర సరుకులు అందజేయాలని తహసీల్దార్ ఈశ్వరరావును ఆదేశించారు. బాధితులను ప్రభుత్వం తరుపున పక్కా ఇళ్ళు నిర్మించటంతో పాటు బీసీ కార్పొరేషన్ నుంచి రుణాలు మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. పోతనపల్లిలో ఇటీవల పిడుగుపాటుకు మృతి చెందిన అబ్బదాసరి శాంతకుమారి కుటుంబాన్ని మంత్రి పరామర్శించి, వ్యక్తిగతంగా రూ. 20 వేలు సహాయం అందించారు. ప్రభుత్వం నుండి వచ్చే సహాయాన్ని త్వరగా అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనారోగ్యంతో విజయవాడ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పి. హారికకు మెరుగైన వైద్యం కోసం సీఎం సహాయ నిధి నుంచి రూ. లక్ష ఎల్‌వోసీని మంత్రి సారథి రోగి కుటుంబ సభ్యులకు అందజేశారు. టీడీపీ నాయకులు మందపాటి బసవారెడ్డి, ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, పలగాని దుర్గారావు, మాదాసు చంద్రకళ, చిన్న పుల్లయ్య, కలకొండ భాస్కరరావు, ధారవత్తు భాస్కరరావు, మల్లిఖార్జునరావు, అధికారులు పాల్గొన్నారు.

ముసునూరు మండలంలో...

ముసునూరు: మండలంలోని పలు గ్రామాల్లో రైతులు, రైతు సంఘం నాయకులు సంయుక్తంగా ఏరువాక పౌర్ణమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు ఆధ్వర్యంలో గుడిపాడులో పేదలకు పట్టాలు ద్వారా పంచిన భూముల్లో ఏరువాక సాగించారు. భూమాతకు, నాగలికి, బసవన్నలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండా లని, రైతులంతా ఆర్థికంగా బలపడాలని ఆకాంక్షించారు. చెక్కపల్లి, గోపవరం, సూరేపల్లి, రమణక్కపేట తదితర గ్రామాల్లో రైతులు ఏరువాక పౌర్ణమి నిర్వహించారు. కూటమి నాయకులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

ఏరువాక పూర్ణిమలో మంత్రి సారథి..
జనార్దనవరంలో ఏరువాక పూజలు



గుడిపాడులో ఏరువాక

గోదావరి తీరంలో పట్టుబడిన గంజాయి

కుక్కునూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కుక్కునూరు మండలం వింజరం గోదావరి రేవుకి అవతలవైపు ఉన్న అల్లూరి జిల్లా కూనవరం మండలం పొలిపాక వద్ద గంజాయితో బుధవారం ఒక యువకుడు పట్టుబడ్డాడు. కుక్కునూరు మండలం వింజరం గోదావరి తీరంలో మత్స్యకారులు చేపలు పడుతూ ప్రయాణికులను పడవలో గోదావరి అవలతల వైపు చేర వేస్తుంటారు.ఈ క్రమంలో అవతల నుంచి పడవదాటి కుక్కునూరు మండలం వైపు రావడానికి ఓ యువకుడు పులిపాక రేవు వద్ద బ్యాగుతో వచ్చాడు. మత్స్యకారులు అనుమానంతో అతని బ్యాగు చెక్ చేయగా పార్శిల్ రూపంలో ఉన్న గంజాయి ఉంది. ఆ యువకుడు పారిపోయే ప్రయత్నం చేయగా మత్స్యకారులు పట్టుకుని కూనవరం పోలీస్‌లకు సమాచారం ఇవ్వడంతో వారు అదుపులోకి తీసుకున్నారు. మూడునెలల క్రితం తెలంగాణలోని బుర్గంపాడు వద్ద పోలీసులు జరిపిన వాహనాల తనిఖీల్లో భారీగా పట్టుబడిన గంజాయి కూడా కుక్కునూరు మండలంలోని గోదావరి తీరంలోనే రేవుదాటి వచ్చినట్లు సమాచారం ఉంది.

రిమాండ్ ఖైదీ మృతి

ఏలూరు క్రైం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో అరెస్టయి రిమాండ్ ఖైదీగా జిల్లా జైలులో ఉన్న యువకుడు అనారోగ్యానికి గురై విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. గణపవరం మండలం చిన్న రామ చంద్రాపురానికి చెందిన ఏళ్ళ సాయికిషోర్‌ను (27) గంజాయి కేసులో ఈ నెల 7న గణపవరం పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్ విధించడంతో ఏలూరు జిల్లా జైలుకు తర లించారు. అప్పటి నుంచి జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. అతను వచ్చిన రెండు రోజుల తరువాత జ్వరం రావడంతో జైలుకు సంబంధించిన వైద్యులు పరీక్షించి మందులు ఇచ్చారు. అవి వేసుకున్నప్పటికీ జ్వరం తగ్గకపోవడం, మరింత నీరసించిపోవడంతో బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో సాయికిషోర్‌ను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి పంపించారు. సాయికిషోర్‌కు వివిధ రకాల వైద్య పరీక్షలు చేయగా యూరిన్ క్రియేటిన్ ఎక్కువగా ఉందని, ఇన్‌ఫెక్షన్ కూడా ఉందని అతనికి సెరిబ్రల్ మలేరియా సోకినట్లుగా గుర్తించారు. అతను ఆసుపత్రిలోని కోమాలోకి వెళ్ళిపోవడంతో ఆక్సిజన్‌పై వైద్యం అందించి మెరుగైన చికిత్స కోసం విజయవాడకు తరలించారు. విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో మరణించాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభు త్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. వైద్యులు ఎమ్మెల్సీగా నమోదుచేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటు ఏలూరు జిల్లా జైలు సూపరింటెండెంట్ స్వామికి కూడా సమాచారం ఇచ్చారు.

విజయ దుర్గాదేవికి విశేష పూజలు

ముదినేపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): దేవపూడిలోని శ్రీ విజయ దుర్గాదేవి ఆలయలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా జ్యేష్ఠ మాసం జ్యేష్ఠా నక్షత్రం సందర్భంగా బుధవారం అమ్మవారికి లక్ష మల్లెల అర్చన, కుంకుమ పూజలు, 108 బిందెలతో 108 మంది బాలలు, సువాసినులు వివిధ రకాల ద్రవ్యాలు, జలాలతో అభిషేకాలు నిర్వహించారు.

భారీ వర్షం

ముదినేపల్లి మండలంలో అత్యధికం
కొట్టుకుపోయిన రహదారి



చిగురుకోట వద్ద పెదకొమ్మిలేరు రహదారికి గండిపడిన దృశ్యం

ముదినేపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలంలో మంగళవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరపి లేకుండా ఐదు గంటలపాటు భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి గ్రామీణ ప్రాంత ప్రజలు భయకంపితులయ్యారు. మండలంలో ఏలూరు జిల్లాలోనే అత్యధికంగా 193.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పలు చోట్ల వైర్లు తెగి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. గతంలో ఏనాడు లేని విధంగా నమోదైన వర్షానికి మండలంలోని పొలాల్లో పెద్ద ఎత్తున నీరు నిలిచింది. మండలంలోని చినపాలపర్రు, ముదినేపల్లి గ్రామాల్లో వెదజల్లిన వరి పొలాల్లో నీరు నిలిచి ఉండటంతో విత్తనాలకు నష్టం జరుగుతుందేమోనని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కాగా భారీ వర్షానికి ముదినేపల్లి మండలంలోని పెదకొమ్మిలేరు డ్రెయిన్ పొంగి ప్రవహిస్తున్నది. అత్యధికంగా కురిసిన వర్షానికి ఈ డ్రెయిన్‌లో నీరు అంచులను తాకుతూ ప్రవహిస్తున్నది. దీంతో డ్రెయిన్‌లో నీటి ఉధృతికి చిగురుకోట గ్రామం వద్ద నిర్మించిన రోడ్డు కొట్టుకుపోయింది. గండిపడిన ప్రదేశం వద్ద రాకపోకలు బంద్ అయ్యాయి.

కైకలూరు: వేసవి ఎండతో అల్లాడిన ప్రజలు మంగళవారం రాత్రి కురిసిన భారీవర్షంతో సేదతీరారు. భారీగా ఈదురుగాలులుతో పాటు వర్షం దంచికొట్టడంతో ఎక్కడికక్కడ డ్రెయిన్లు పొంగిపొర్లాయి. ఉపరితల ఆవర్తనంతో ఒక్కసారిగా వాతావరణం మారి భారీ వర్షం కురవడంతో బుధవారం వాతావరణం చల్లగా ఉండి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

మండవల్లి: మంగళవారం రాత్రి మండవల్లిలో 97.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మండలంలోని లోతట్టు ప్రాంతాలన్నీ అయ్యాయి. జాతీయ రహదారి పామర్రు-దిగమర్రు 165 రహదారిపై కైకలూరు సంత వద్ద భారీస్థాయిలో వర్షపునీరు నిలబడి చెరువును తలపించింది. అధికారుల పర్యవేక్షణ లోపం కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో డ్రైనేజీ ఏర్పాటు చేసినప్పటికీ జాతీయ రహదారిపై భారీగా నీరు నిలబడిపోవడం బాధాకరమని ప్రజలు వాపోతున్నారు.

ముసునూరు: మండల వ్యాప్తంగా బుధవారం తెల్లవారుజామున ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఏకధాటిగా రెండు గంటలపాటు కురిన వర్షానికి ప్రధాన, అంతర్గత రహదారులు వాగులను తలపించాయి. ఈదురు గాలులకు పలు గ్రామాల్లో చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ లైన్లపై పడటంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సుమారు ఏడుగంటలు విద్యుత్ సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ భారీ వర్షానికి చెరువుల్లోకి ఒక మోస్తరుగా నీరు చేరింది.

ఆక్వా రైతులు దిగాలు..

కలిదిండి: బుధవారం తెల్లవారుజామున భారీ వర్షంతో ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. నాలుగు రోజులుగా ఎక్కువగా ఎండలు వేసి అకస్మాత్తుగా వాతావరణం చల్లబడి భారీ వర్షం కురవటంతో చేపలు, రొయ్యల చెరువుల్లో నీరు చల్లబడి ఆక్సిజన్ లోపించింది. దీంతో ఆక్వా రైతులు ఖరీదైన మందులు కొనుగోలు చేసి చెరువుల్లో చల్లుతున్నారు. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగటంతో అద్దె జనరేటర్లతో ఏరియేటర్లను తిప్పుతున్నారు. పలు చెరువుల్లో రొయ్యలు చనిపోతుండటంతో రేయింబవళ్ల రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ కొరత ఏర్పడకుండా ఉండటానికి నిరంతరాయంగా ఏరియేటర్లను తిప్పుతున్నారు. ఖరీదైన ఆక్సిజన్ టాబ్లెట్‌లను చెరువుల్లో వేస్తున్నారు. రొయ్యల పంట చేతికి వస్తుందో లేదోనని దిగాలు చెందుతున్నారు.

బడికి నవోదయం

(మూడో పేజీ తరువాయి)

విద్యార్థులకు తెలుగు, గణితం, పరిసరాల విజ్ఞాన శాస్త్రం, ఆంగ్లం సబ్జెక్టులన్నింటికీ కలిపి ఒకే పాఠ్య పుస్తకాన్ని రెండు సెమిస్టర్లు (ఆరు నెలలకో సెమిస్టర్) గా విభ జించి ముద్రించారు. ఆ ప్రకారం తొలి అర్ధ సంవత్సర సెమిస్టర్‌కు సంబంధించిన పుస్తకాలనే విద్యార్థి స్కూలుకు తెస్తే సరిపోతుంది.

బడి బయట పిల్లలను బడికి..

జిల్లావ్యాప్తంగా 20,486 మంది బాలబాలికలు బడిమధ్యలోనే మానేశారని గత మార్చిలో గుర్తించిన ప్రభుత్వం, ఆ మేరకు డ్రాపవు ట్లుగా తేల్చిన వారంతా ప్రస్తుతం ఎక్కడ ఉన్నారో, ఏం చేస్తున్నారో క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి, ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌తో వారిని మళ్లీ బడిలో చేర్పించాలని జిల్లా అధికారులకు ఆదేశాలు పంపింది.

పునర్వ్యవస్థీకరణ ప్రకారమే టీచర్లకు విధులు: వెంకట లక్ష్మమ్మ, డీఈవో

తొమ్మిది రకాల బడులకు అనుగుణంగా జిల్లాలోని ఉపాధ్యాయు లందరూ సోమవారం నుంచి ఆయా పాఠశాలల్లో విధులు నిర్వర్తిం చాలి. సోమవారం విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలను అందజేస్తారు. నూతన విద్యార్థులను చేర్చుకునేందుకు పాఠశాలల వారీగా ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను హెచ్‌ఎంలు, టీచర్లు నిర్వహించాలి. ఆరోతరగతి విద్యార్థులకు బ్రిడ్జికోర్సు తరగతులను నిర్వహించాలి. యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులందరితో యోగాసనాలను ప్రాక్టీస్ చేయించడంతోపాటు, విద్యార్థులను లీప్ యాప్‌లో రిజిస్ట్రేషన్‌చేసి అప్‌డేటెడ్‌గా ఉంచుకోవాలి.